# కాలజ్ఞానసుధ


ఆధ్యాత్మిక మాస పత్రిక

సెప్టెంబరు - 2015 సంపుటి:19 సంచిక:9




**ఈ నెల సూక్తి**

➢ స్థిర సంకల్పం కలిగినవారు మాత్రమే భక్తిమార్గంలో విజయం సాధించగలుగుతారు.



## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - ప్రకృతమాతా నమోస్తుతే | 4 |
| శ్రీగణనాధం భజామ్యహమ్ | 6 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (పాలక (రాజు) ధర్మములు) | 8 |
| వేదపరిచయము | 10 |
| సుశీల కథ | 15 |
| ఏకోదేవో దేవకీ పుత్రేవ | 18 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 19 |
| యోగవాసిష్ట కథాలహరి - తన జనన మరణాలను తానే చూచిన గాధి | 22 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 24 |
| శీలం జీవితాన్ని రక్షిస్తుంది | 26 |
| శ్రీరామ భక్తి ( అగస్త్యమహార్షి శ్రీరామభక్తి) | 28 |
| రఘువంశం | 30 |
| ద్రౌపది సహృదయత అనిర్వచనీయం | 33 |
| దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు (శ్రీకాకుళం) | 35 |


ముఖచిత్రం : విశ్వకర్మ మహాదేవులు


**చందా వివరములు**

జీవిత చందా (20సం॥) : 1116/-

సంవత్సర చందా : 70/-



చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# ప్రకృతమాతా నమోస్తుతే!

ప్రకృత మాతకు చిన్న పెద్ద తేడాలేకుండా అందరూ నమస్కరించాలి. మాన్యుడు - సామాన్యుడు ఆస్తికుడు - నాస్తికుడు అనే తేడా కూడా వుండరాదు. ఎందుచేతనంటే ప్రకృతి ప్రకోపిస్తే ఆ ప్రళయానికి అందరూ కకావికలౌతారు.

ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృధ్వి ఈ ఐదింటిని పంచభూతాలు అంటారు. వీటిలో ఏది లోపించినా మన మనుగడ ప్రశ్నార్థకమే. మానవ దేహంలోనూ ఈ ఐదుభూతాల శక్తి వుంటుంది. ఏ భూతం లోపిస్తే ఆపరమైన వ్యాధి వస్తుందని మన ఋషులు చెప్పారు. వాటినే నేటి శాస్త్రీయ పరిభాషలో మనం వివిధ పేరులతో పిలుచుకుంటున్నాము. ప్రకృతి మనిషికి జీవనాధారం. ఈ విషయం కొంచెం పరిజ్ఞానం వున్నవారి కందరికీ తెలుసు. కాని నేటి మనిషి ప్రకృతిని ప్రేమించకపోగా అశ్రద్ధచేస్తున్నాడు. తన అకార్యాలతో ప్రకృతిని కలుషితం చేస్తున్నాడు. పారిశ్రామిక కాలుష్యం ప్లాస్టిక్ వ్యర్థములు తదితర అనేక పద్ధతులతో ప్రకృతి కాలుష్యంతో నిండిపోతుంది. కాలుష్య నియంత్రణ గురించి ఎవరు పట్టించుకోరు. ఆ... అది నాకు సంబంధించిన వ్యవహారం కాదులే! అనుకుంటున్నారు. గాలి కలుషితం, నీరు కలుషితం, భూమి (వ్యర్థాల ద్వారా) కలుషితం ఇలా రకరకాల కలుషితాలకు మనిషే కారణం. "ఏమయ్యా ప్లాస్టిక్ వాడకండి, ఆవ్యర్థాలను ఎక్కడంటే అక్కడ పడేయకండి" అంటే అతడు వినీవిననట్లు వెళుతాడు. మన శాస్త్రవేత్తలు నెత్తినోరు మొత్తుకొని చెప్తున్నారు. "ప్రకృతి కాలుష్యం పెరిగిపోతున్నది, తద్వారా విపరీతమైన పరిణామాలు చోటుచేసుకుంటాయి. అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోండి అని ఓజోన్ పొరకు రంధ్రం పడింది. తద్వారా అనేక విపరీతమైన ప్రమాదం మానవాళికి వున్నదని మన శాస్త్రవేత్తలు చెపుతున్నారు. అది విన్నప్పడు నిజమే అని అనుకోవటం తప్ప దాని నివారణకు మనము ఏ మాత్రం ప్రయత్నించం.

ప్రస్తుతం దేశంలో అత్యధిక భాగం అనావృష్టి ప్రభావం వున్నదని చెపుతున్నారు. ఆగస్టు 19, 20 తేదీల వరకు దేశంలో సగటున 20 శాతం కన్న వర్షం తక్కువగా వున్నదని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్పారు. దానికి గల కారణాలను కూడా వారు చెపుతున్నారు. పేపరులో చదువుతున్నాము. టీ.విలలో చూస్తున్నాము. అయినా తన వంతు జాగ్రత్తను ఎవరూ పాటించరు.

ఏదైనా వరుణయాగం చేస్తున్నారు అంటే ఆ... వారి పిచ్చిగాని యాగం చేస్తే వర్షం కురుస్తుందా?

అనే వారులేకపోలేదు. ఆస్తికునికి, నాస్తికునికి అందరికి వర్షం కావాలి. నీరులేకుండా బ్రతికే వారెవరు ? నీటిని పొదుపుగా వాడుతూ నీటిని కలుషితం కాకుండా చూడాలి. షాపులో పచారీ సరుకులు తెచ్చుకొని ఆ ప్లాస్టిక్ సంచిని మాత్రం అలా వీధిలో పారవేయడానికి ఏమాత్రం వెనుకాడని మనం ప్రకృతి ప్రేమికులమా! ప్రకృతి భక్షకులమా ! ఇది ఏ ఒక్కరినో విమర్శించడంకాదు. ఇది అందరి సమిష్టి బాధ్యత అని అందరూ గ్రహించాలి. దీనికి కులం, మతం, వర్గం, వర్ణం అనే వ్యత్యాసమేముంటుంది. నేటి మనిషిలో అలసత్వం ఎక్కువ. దానికి అనేక ఉదాహరణలు వున్నాయి.

తన స్వార్థానికి ఎటువంటి పాపాన్నైనా చేయడానికి వెనుకాడని స్థితికి ఎక్కువ మంది చేరారు. మన పార్లమెంటు లేదా శాసనసభలనే దేవాలయాలలో ఏమి జరుగుతుందో నేనేమి చెప్పనక్కరలేదు. అధికార పార్టీ ఒక పనిచేస్తే దానిని ప్రతిపక్షం వ్యతిరేకించటమే! ప్రతిపక్షం. మంచి సూచన చేస్తే దానిని అధికార పక్షం వ్యతిరేకించటమే! ఇది నేటి రాజకీయ విధానమా! అన్నట్లుంటుంది. స్వాతంత్ర్యం సంపాదించి పదవిని వదులుకొని త్యాగధనుడుగా మారిన మహాత్మాగాంధీ మన ఆదర్శంకాదా! ఆయన ఆశయాల మేరకు నడచుకొంటున్న వారెందరు? రైలు యాక్సిడెంటు జరిగితే తన రైల్వేమంత్రి పదవికి రాజీనామా చేసిన మహానుభావుడూ మనవాడే. నేడు వారి వారసులేరి ?

మన ఈ నడవడి మారాలి ? అందరూ భాధ్యతాయుతంగా నడచుకోవాలి. మన ప్రక్కవారి యందు, తన  గ్రామమందు, తన దేశమందు గౌరవభావంతో కూడిన భాధ్యత కలిగివుండాలి. ప్రకృతిని ప్రేమించాలి అంటే ప్రకృతికి నష్టం కలిగే ఏ పనినీ మనం చేయకుండా వుంటేనే ప్రకృతిని ప్రేమించినట్లు గుర్తించాలి. ఇంట్లో పూజా మందిరంలోని ఇష్టదేవతకు నమస్కరిస్తారు. మందిరంలోని భగవంతునికి నమస్కరిస్తారు. ప్రకృతిని అశ్రద్ధ చేస్తారు. ఆ ఇంటిలోని, మందిరంలోనూ, గుడిలోనున్న ఆ పరమాత్మే ప్రకృతి రూపంలో వున్నాడు.  ఈ విషయాన్ని మనసులో పెట్టినట్టైతే తప్పక ప్రకృతిని ప్రేమిస్తాం. గౌరవిస్తాం. కలుషితం చేయం. తాను త్రాగే నీటితో ఎవరైనా విషం కలుపుకుంటారా? ప్రకృతి, తాను త్రాగే నీటిలాంటిదేనన్న విషయాన్ని మరువరాదు సుమా!

అన్నిదెసల బ్రహ్మ మావరించుటవలన
ప్రకృతికెల్ల మ్రొక్కపాడియగును
ప్రకృతి రూపముగను బ్రహ్మమ్ము గనుపట్టు
కాళికాంబ! హంస! కాళికాంబ!        అన్నారు శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారు.

భగవత్సేవలో.... సంపాదకులు

ప్రధమ పూజ్యుడు - వినాయకుడు

# శ్రీగణనాధం భజామ్యహమ్

... ములకుట్ల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, ఒంగోలు.

**వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ।**
**నిర్విఘ్నం కురుమే దేవ సర్వకార్యేషు సర్వదా॥**

"ఆదౌపూజ్యాగణాధిపః" అన్ని పూజలకు మొదట పూజింపబడువాడు 'శ్రీమహాగణపతి' గణపతి పూజలేనిదే దేవతారాధన విధిలో ఏ పూజయు లేదనుట అందరికి తెలిసిన విషయమే.

'కలౌ కపి వినాయకౌ" అని ప్రసిద్ధి సర్వకార్య నిర్విఘ్నతా పరిసమాప్తికి, కోరిన కోర్కెలు ఫలించుటకు ఈ కలియుగమున శ్రీహనుమద్వినాయక దేవతలు ప్రముఖులు.

శ్రీమహాగణపతికి 'క్షిప్రప్రసాది' అనిపేరు. అంటే శీఘ్రంగా ఫలితాన్ని ఇస్తాడని అర్థం.

విఘ్నకర్త్రేనమః, విఘ్నహర్త్రే నమః అని శ్రీగణపతి అష్టోత్తర శతనామావళిలో కనిపిస్తుంది. విఘ్నాలు కలిగించే దైవం, తొలగించే దైవం, ఏ కార్యాల వలన మనకు అశుభం కలుగుతుందో వాటికి విఘ్నాలు కలిగిస్తాడని భావం. గణపతికి ఒక టెంకాయ కొట్టి కార్యం ప్రారంభించనిచో ఆ పని ముక్కచెక్కలు అవుతుందని జనాభిప్రాయం.

సర్వజగన్నియామకుడు, పరిపూర్ణ పరబ్రహ్మ పరమాత్మ తత్త్వమే - శ్రీగణపతి అని గాణాపత్యులు (గణపతిని పరబ్రహ్మముగా భావించేవారు) విశ్వసిస్తారు.

స్వామి నిరాకార స్వరూపానికి ప్రతీకగా హరిద్రాగణపతిని (పసుపు ముద్దతో చేసిన) ఆరాధిస్తారు.

శ్రీమహాగణపతి ఆవిర్భావం గురించి శ్రీగణేశపురాణము, ముద్గలపురాణము, బ్రహ్మాండ పురాణము ఎన్నో వివరాలు తెలియచేస్తాయి. శ్రీగణపత్యధర్వశీర్షము, శ్రీగణేశోపనిషత్ .... మరిన్ని వివరాలు అందిస్తాయి.

పార్వతీదేవి తన అభ్యంగన స్నానానికి (తలంటు) ముందు, ఒంటికి నలుచుకొన్న నలుగుపిండితో ఒక బాలుణ్ణిచేసి ద్వారపాలకునిగా ఉంచడం, శంకరుని రాకను అడ్డగించడం, బాలుని శిరశ్ఛేదనం, ఏనుగుతల అతికించుట, పార్వతీపరమేశ్వరుల పుత్రుడిగా, గజముఖుడిగా స్వామి వైభవం ఈ కథ బాగా ప్రసిద్ధం.

బ్రహ్మాండ పురాణంలో శ్రీలలితాంబిక భండాసురుని సంహారానికి వెళ్తూండగా భండాసురుని సేనాధిపతి విశుక్రుడు 'విఘ్నయంత్రం' అమ్మ సేనలపై ప్రయోగించటం, 'కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీగణేశ్వరా' ఆ సందర్భంలో శ్రీలలితాంబిక చిరునవ్వుతో కామేశ్వరుని వైపు చూడటం, అమ్మ చిరునవ్వులకాంతులలోంచి శ్రీగణపతి ఆవిర్భవించటం, విఘ్నయంత్రం నాశనం చేయటం కనిపిస్తుంది.

పంచమవేదమైన శ్రీమహాభారత రచనలో వ్యాస భగవానునికి లేఖకునిగా తన దంతమును ఉపయోగించిన కధను స్ఫురిస్తూ ఏకదంతాయనమః అని స్వామికి నమస్కరిస్తాం.

శ్రీగణపతి ఆరాధనలో వినియోగించే ఏకవింశతి (21) పత్రాలు చక్కని ఔషధ గుణాలు కలిగినవిగా వైద్యశాస్త్రం చెబుతుంది.

మాచిపత్రి, నేలమునగ (వాకుడు), మారేడు,
జంటగరిక, ఉమ్మెత్త, రేగు, ఉత్తరేణి,
తులసి, మామిడి, గన్నేరు, అవిసె,
దానిమ్మ, దేవదారు, మరువం, వావిలి
జాజి, జమ్మి, రావి, మద్ది, జిల్లేడు, వేప

ఈ 21 ఆకులను అత్యంత శ్రద్ధతో శక్తిమేర సేకరించి స్వామిని ఆరాధించాలి. ప్రధాన గణపతుల సంఖ్య 21 వారి ఆరాధనకి ఈ పత్రపూజ అని పెద్దల మాట.

సూర్యుడు నమస్కార ప్రియుడు. విష్ణువు అలంకారప్రియుడు గణపతి తర్పణప్రియుడు అని నానుడి.

శ్రీగణపతి అనుగ్రహం పొందాలంటే దూర్వాయుగ్మం (జంటగరికె) సమర్పించాలి. అనలాసురుడిని మింగిన సందర్భంలో స్వామికి దేవ, ఋషిగణాలు పచ్చనిగరికను స్వామిపై ఉంచి శాంతపరిచారని కథ.

వినాయక చవితి నాడు శ్రీమహాగణాధిపతిని ఆరాధించి కథలను విని అక్షతలను శిరసున దాల్చటం వల్ల సర్వశుభాలు కలుగుతాయి.

అనేకమంది కవులు, వాగ్గేయకారులు గ్రంధారంభంలో నిర్విఘ్నపరిసమాప్తికై శ్రీగణపతిని స్తుతించారు. పోతనామాత్యుడు ఆంధ్రామహాభాగవతంలో

ఆదరవొప్ప మ్రొక్కెడుదు అద్రినుతా హృదయానురాగ సంపాదికి, దోసభేదికి, ప్రరున్న వినోదికి....

అల్లసానిపెద్దన మనుచరిత్ర కావ్యంలో - అంకము చేరి శైలతనయాస్తన... కరుణశ్రీ... ఎందరో కవులు కీర్తించారు.

త్యాగయ్యగారు 'వినాయకుని వలెను నను బ్రోవు కామాక్షి' ముత్తుస్వామి దీక్షితులు వారు 'వాతాపి గణపతిం భజే...' ఎన్నో కీర్తనలు రచించారు.

శ్రీగణపతి బ్రహ్మచారి. శ్రీగణపతికి సిద్ధి, బుద్ధి అనే భార్యలున్నారని క్షేమం, లాభం అనే పుత్రులున్నారని కూడా లోకంలో ప్రచారంవుంది. మన సాంప్రదాయ భగవంతుని యొక్క శక్తులు-భార్యాలుగా చెప్పారు. శ్రీగణపతిని ఆరాధిస్తే చక్కని బుద్ధి (తెలివితేటలు), సిద్ధి (ఫలప్రాప్తి) లభిస్తాయని దానిద్వారా క్షేమ, లాభములు కలుగుతాయని పెద్దలమాట.

శ్రీగణపతిని విస్మరించినవాడు -శోకంలో మునిగిపోతాడని కావ్యకంఠ శ్రీగణపతి మాట.

**గణపతిని సేవిద్దాం - సర్వశుభాలు పొందుదాం.**

*- సంకటనాశన గణపతి స్తోత్రమ్*

నారద ఉవాచ :

**ప్రణమ్య శిరసా దేవం- గౌరీపుత్రం వినాయకమ్।**
**భక్తావాసం స్మరేన్నిత్యం - ఆయుష్కామార్ధ సిద్ధయే॥**
**ప్రధమం వక్రతుండంచ - ఏకదంతం ద్వితీయకం।**
**తృతీయం కృష్ణపింగాక్షం - గజవక్త్రం చతుర్ధకమ్॥**
**లంబోదరం పంచమంచ - షష్ఠం వికటమేవచ।**
**సప్తమం విఘ్నరాజం చ - ధూమ్రవర్ణం తథాష్టమమ్॥**
**నవమం ఫాలచంద్రంచ - దశమం తు వినాయకమ్।**
**ఏకాదశం గణపతిం ద్వాదశం తు గజాననమ్॥**

ఈ 12 నామములను ప్రతిరోజు 3 సార్లు పఠిస్తే సర్వవిఘ్ననాశనము, విద్య, ధనము, ఆరోగ్యం సర్వశుభాలు ప్రాప్తిస్తాయని శాస్త్రవచనము. □

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్; 09410990829

## (19. పాలక (రాజ) ధర్మములు)

(గత సంచిక తరువాయి)

**శ్లో॥ పానమక్షాః స్త్రియశ్చైవ మృగయాచ యథాక్రమమ్।**
**ఏతత్కష్టతమం విద్యాచ్చతుష్కం కామజే గణే ॥ (మను VII-50)**

'కామముచే జనించు ఉపద్రవములలో ఈ క్రింది నుదహరించిన నాల్గు చాలా హానికరములైనవి. అవి - మద్యపానము, జూదము, స్త్రీలోలత్వము, వేట'.

**శ్లో॥ దండస్య పాతనం చైవ వాక్పారుష్యార్థదూషణే।**
**క్రోధజేఽపి గణే విద్యాత్కష్టమేతత్ త్రికం సదా॥ (మను VII-51)**

క్రోధము వలన జనించు ఉపద్రవములలో మూడు చాలా హానికరములైనవి. అవి -అన్యాయముగా క్రూరమైన శిక్షను విధించుట, పరుషవాక్యము లాడుట, అక్రమమైన డబ్బు వ్యవహారము.

**శ్లో॥ సప్తకస్యాస్య వర్గస్య సర్వత్రైవానుషంగిణః।**
**పూర్వం పూర్వం గురుతరం విద్యాద్వ్యసనమాత్మవాన్॥(మను VII-52)**

(పై నుదహరించిన) కామ జనిత నాల్గ ఉపద్రవములు, క్రోదజనిత మూడు ఉపద్రవములు సామాన్యముగా పాలకులందరి యొక్క బలహీనతలై యున్నవి. వీటిలో మొదటి నాల్గ తరువాత మూటికంటె చాలా హానికరములైనవని విజ్ఞులైన పాలకులు తెలిసికొనవలయును.

ఈనాటి దేశపాలకులలో గూడ చాలా మందిపై నుదాహరించిన వ్యసనములకు లోనైయున్నారు. వారికి పై సూక్తులు కనువిప్పును కలిగించు గాక!

అక్రమపాలన వలన సంభవించు దుష్ఫలితములను మనుమహర్షి ఈ క్రింది సూక్తిలో వర్ణించుచున్నాడు :

**శ్లో॥ మోహాద్రాజా స్వరాష్ట్రం యః కర్షయత్యనవేక్షయా।**
**సోఽచిరాద్ భ్రశ్యతే రాజ్యాజ్జీవితాచ్చ సబాంధవః॥ (మను VII-111)**

పాలనాధికారి తన తప్పువలన దేశప్రజలను కష్టముల పాలొనర్చి, సంరక్షించలేకపోయిన యెడల, అతడు పాలనాధికారమును తప్పక కోల్పోవును మరియు సమూలముగా నశించును.

**శ్లో॥ శరీర కర్షణాత్ప్రాణాః క్షీయంతే ప్రాణినాం యథా!**
**తథా రాజ్ఞామపి ప్రాణాః క్షీయంతే రాష్ట్రకర్షనాత్॥ (మను VII-112)**

ఎలాగైతే ఒక వ్యక్తి యొక్క శరీరము నిరంతరముగా బలహీనమగుచుండుట వలన ప్రాణశక్తి ఆ వ్యక్తిని పరిత్యాగము చేయునో, అలాగుననే దేశప్రజలు ఎల్లప్పుడు బాధల ననుభవించుచుండిన యెడల ఆ దేశపాలకుని యొక్క సత్తువయు క్షీణించిపోవును.

పై రెండు సూక్తులు దేశపాలకుడు తన దేశప్రజల క్షేమమును గురించి ఎంత జాగ్రత్త, శ్రద్ధలను తీసికొనవలయునో, అట్లు చేయని ఎడల సంభవించు విపత్కర పరిణామములను చక్కగా విశదీకరించుచున్నవి.

తరువాత, మనుమహర్షి ఒక నగ్నసత్యమును వెల్లడించియున్నారు. అదేమనగా - రక్షణశాఖాధికారులు సర్వసాధారణముగా లంచగొండులై యుందురనియు, వారిని దేశపాలకుడు తగురీతిగా శిక్షించవలయుననియు బోధించుచున్నాడు. ఇది ఈనాటి పాలకులు ముఖ్యముగా గమనించదగిన విషయము.

**శ్లో॥ రాజ్ఞో హి రక్షాధికృతా పరస్వాదాయినః శఠాః।**
**భృత్యాభవంతి ప్రాయేణ తేభ్యో రక్షేదిమాఃప్రజాః॥ (మను VII-123)**

**శ్లో॥ యే కార్యికేభ్యో-ర్థమేవ గృహ్ణీయుః పాపచేత సః।**
**తేషాం సర్వస్వమాదాయ రాజా కుర్యాత్ప్రవాసనమ్॥(మను VII-124)**

'రక్షణ శాఖాధికారులు సర్వసాధారణముగ

భ్రష్టాచారులై (లంచములు తీసుకొనువారలై), పరుల ఆస్తిని కబళించువారలై యుందురు. కావున, దేశపాలకుడు ప్రజలను వారి నుండి రక్షించవలయును. అటువంటి అధికారుల యొక్క ఆస్తిని జప్తిచేసి, వారిని దేశబహిష్కృతులను చేయవలయును'.

మనుమహర్షి పలువిధములగు పన్నులను (ట్యాక్స్ గురించి విపులీకరించుచూ, ఎట్టి పరిస్థితులలోను శ్రోత్రియుని నుండి ఏ విధమైన పన్నును వసూలు చేయగూడదనియు, అతని పోషణాభారమును పాలకులే వహించవలయుననియు, శ్రోత్రియునిచే ఆచరింపబడు ధర్మము దేశపాలకుని మరియు దేశమును గూర్చి సంరక్షించుననియు వచించుచున్నాడు.

**శ్లో॥ మ్రియమాణోఽప్యాదదీత న రాజా శ్రోత్రియాత్కరమ్।**
**న చ క్షుధాస్య సంసీదే చ్ఛ్రోత్రియో విషయే వసన్॥(మను VII-133)**

'దేశము ఎంత బీదస్థితిలో నున్నప్పటికి శ్రోత్రియుని వద్ద నుండి ఏ విధమైన పన్నును వసూలు చేయగూడదు మరియు ఎట్టి పరిస్థితిలోను శ్రోత్రియుడు ఆకలితో బాధపడుచూ ఉండకూడదు'.

**శ్లో॥ యస్య రాజ్ఞస్తు విషయే శ్రోత్రియః సీదతి క్షుధా।**
**తస్యాపి తత్క్షుధా రాష్ట్రమచిరేణైవ సీదతి ॥(మను VII-134)**

ఏ దేశములో శ్రోత్రియుడు ఆకలితో బాధపడుచుండునో, ఆ దేశము ఆ ఆకలి వలననే త్వరలో నశించును.

**శ్లో॥ శ్రుతవృత్తే విదిత్వాస్య వృత్తిం ధర్మ్యాం ప్రకల్పయేత్।**
**సంరక్షేత్సర్వతశ్చైనం పితా పుత్రమివౌరసమ్॥ (మను VII-135)**

అతని (శ్రోత్రియుని) యొక్క వేదజ్ఞానమును గురించియు మరియు అతని వ్యక్తిత్వమును గురించియు పూర్తి సమాచారమును తెలిసికొనిన తరువాత అతని పోషణార్థమై తండ్రి తన పుత్రునికి వలె తగు ఏర్పాట్లు కల్పింపవలయును.

**శ్లో॥ సంరక్ష్యమాణో రాజ్ఞా యం కురుతే ధర్మమన్వహమ్।**
**తేనాయుర్వర్ధతే రాజ్ఞో ద్రవిణం రాష్ట్రమేవ చ ॥ (మను VII-136)**

శ్రోత్రియునిచే ఆచరింపబడు ధర్మము పాలకుని సంరక్షించును, దీర్ఘాయుష్యము నిచ్చును, శ్రీమంతుని చేయును మరియు దేశమును గూడ పురోభివృద్ధిగావించును.

మనుమహర్షి యుద్ధనీతిని గురించి క్లుప్తముగా వివరించినారు. జయాపజయములు ఊహాతీతములగుట చేత, సాధ్యమైనంత వరకు యుద్ధము సంభవించకుండ దేశపాలకుడు సర్వవిధముల ప్రయత్నించవలయునని మనుస్మృతి బోధించుచున్నది.

**శ్లో॥ సామ్నా దానేన భేదేన సమస్తైరథవా పృథక్ ।**
**విజేతుం ప్రయతేతారీన్న యుద్ధేన కదాచన॥(మను VII-198)**

యుద్ధము సంభవించని విధముగ రాజకీయ విధానమును అమలు పరచుట శ్లాఘనీయము. పరస్పర సంభాషణలు, దానము, కుయుక్తిచేత శత్రుదళమును విభజన గావించి శత్రువును బలహీనపరచుట - ఈ పద్ధతులలో ఏ ఒక్క పద్ధతి నుపయోగించియైనను లేక సమ్మిళితముగా ఉపయోగించియైనను శత్రువుపై ఆధిక్యమును పొందవలెను

**శ్లో॥ అనిత్యో విజయో యస్మాద్దృశ్యతే యుధ్యమానయోః।**
**పరాజయశ్చ సంగ్రామే తస్మాద్యుద్ధం వివర్జయేత్॥(మను VII-199)**

యుద్ధములో జయాపజయములు అనిత్యములగుటచేత సాధ్యమైనంత వరకు యుద్ధము సంభవించకుండునట్లు చూడవలెను.

ఏ దేశములో పాలకుడు పాపభూయిష్టమైన ధనమును (శిక్షారూపములో నహితము) పరిగ్రహించక, న్యాయార్జిత ధనముతో పరిపాలన గావించునో; అట్టి దేశములో జనన మరణములు సకాలములో సంభవించుననియు, ప్రజలు దీర్ఘాయుష్యమును కలిగియుందురనియు, పంటలు సస్యశ్యామలముగా ఫలించుననియు మనుస్మృతి బోధించుచున్నది.

- సశేషం

# వేద పరిచయము

## సామవేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

(గత సంచిక తరువాయి)

వేదగణనలో సామవేదము మూడవది. ఋగ్వేదయజుర్వేదములు జ్ఞానకాండ, కర్మకాండలని తెలుసుకున్నాం. సామవేదం ఉపాసనాకాండ. 'ఉపాసన' అంటే పరమేశ్వరునికి సమీపములో ఉండడం. అనగా మనస్సును ప్రాపంచిక విషయచింతనల నుండి మరలించి అంతర్ముఖం చేసి తనలో వ్యాపించియున్న పరమాత్మతో సంయుక్తం చేయటం. ఆ విధంగా సంయుక్తం చేసి పరమేశ్వరుని స్తుతిప్రార్థనలు చేయాలి. అతనిని ధ్యానించాలి. దానివల్ల మనస్సు నిర్మలమై, ప్రసన్నమై అనిర్వచనీయమైన ఆనందమును పొందుతుంది. అందుకు సామవేదమంత్రాలు మార్గదర్శనం చేస్తాయి. మనస్సును ఉపాసనామగ్నం చేయుడానికి సహకరిస్తాయి. ఈ వేదంలోని చాలా మంత్రాలు అనగా 1800 మంత్రాలు ఋగ్వేదంలోనివే. 75 మంత్రాలు మాత్రమే సామవేదానికి చెందినవి. కేవలం గానం చేసే విధానమే దీని ప్రత్యేకత. కావున వేదగణనలో దీనిని రెండవదిగా చెప్పవచ్చు. ఋగ్వేదంతో దీనికి ఎక్కువగా సంబంధం ఉండడమే కారణం. 'ఋచం సామ యజామహే' అని అథర్వవేదం కూడా సామవేదాన్ని కీర్తించింది. 'సామ్న ఉద్గీథో రసః' అని ఛాందోగ్యోపనిషత్తు. 'ఉద్గీథం' అంటే ఓంకారం. 'ప్రణవః సర్వవేదేశు' 'ఓంకారః సర్వవేదానాం' ఇత్యాది వచనముల వలన ఓంకార ప్రాశస్త్యము తెలుపబడును. దీనిని ఉద్గాత పఠిస్తాడు. ఓంకారమూలకమవడం చేతనే సామవేదం వేదాలలో కెల్లా తలమాణికమైనది. 'న సామ యజ్ఞో భవతి' సామములేనిదే యజ్ఞము లేదని చెప్పబడింది.ఋక్కుల కంటే విలక్షణమైనదిగాను, శ్రావ్యమైనదిగాను, మనోహరంగా పాడబడడంచేత దీనికొక ప్రత్యేకత ఏర్పడింది. సోమయాగంలో పఠింపదగిన క్రమాన్ని అనుసరించి వేరుగా కూర్చబడిన కొన్ని ఋక్కుల కూడికయే సామసంహిత అయింది. యజ్ఞంలో ఉద్గాత స్వరబద్ధంగా, ఉచ్చస్వరంతో గానం చేసే మంత్రాల సమూహమే సామవేదం.

'సా చ అమశ్చేతి తత్సామ్నః సామత్వం' అని బృహదారణ్యకోపనిషత్తు. 'సా' అంటే 'ఋక్కు' అని అర్థం. 'అమ' అంటే గాంధారాది స్వరాలు. 'సామ' అనగా ఋక్కుల యొక్క స్వరప్రధానమైన గానమని అర్థం. ఏ ఋక్కులను సామరూపంలో గానం చేస్తారో వాటిని వైదికులు 'సామయోని' అంటారు. 'గీతిషు సామాఖ్యా' అని జైమిని 'సామ' శబ్దానికి 'గాన' మనే అర్థాన్ని చెప్పాడు.

సామశబ్దానికి సుందర సుఖకరవచనమని కూడ అర్థం. సంగీతం సుఖకరమైంది. ఆనందదాయకమైంది. అందుకే 'సామ' శబ్దానికి 'సంగీతమ'నే అర్థం చెప్పబడినది. ఉద్గాత తన సామవేదగానం ద్వారా దేవతలను ప్రశంసిస్తాడు. విశేషంగా సామగానం సోమరసం తయారు చేసేటప్పుడుగాని, చంద్రలోకవాసి దేవతల స్తుతి సమయంలోగాని చేయబడుతుంది

'సామాని యో వేత్తి న వేద తత్త్వం' సామవేదాన్ని తెలుసుకున్నవారే వేదరహస్యాన్ని గ్రహించగలుగుతారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు తనను 'వేదానాం సామవేదోఽస్మి' అని చెప్పుకోవడం చేత సామవేదమునకు గల ఔన్నత్యాన్ని స్పష్టం చేస్తుంది.

'ఋచి అధ్యూఢం సామ' అని. ఋక్కులనే ఆధారముగా తీసుకుని సామములు ఏర్పడుటచే ఛాందోగ్యమున దీనికి పతీపత్నీ భావమూహించబడినది.

ఋగ్వేదములో వైరూప, బృహత్, రైవత, గాయత్ర, భద్రాద్రిసామములు కొన్ని పేర్కొనబడినవి. యజుర్వేదంలో రథంతర, వైరాజ, వైఖానస, వామదేవ్య, శాక్వర, రైవత, అభివర్తాది సామములు పేర్కొనబడినవి. ఐతరేయమున నైధన, కారవ, యౌధాజయం, అగ్నిష్టోమీయ సామములు స్మరించబడినవి.

వేదాలలో మూడు రకాలైన మంత్రాలున్నవి. ఋక్కు, యజుస్సు, సామగీతి. ఋక్కులు గేయ, అగేయాలని రెండు విధాలు. సామవేదంలో గేయఋక్కులు, గేయయజుస్సులు రెండున్నవి. సామవేదంలోని ఋక్కులను 'ఆర్చిక' అని, యజుస్సులను 'స్తోక' అని అంటారు. దేశకాల పాఠగురుభేదాన్ని బట్టి వీటిల్లో తిరిగి అనేక భేదాలు ఏర్పడినవి.

వేదవ్యాసుని వద్ద మొదట ఈ సామవేదము జైమిని చదివెను. అతని వద్దనుండి ఇది అతని శిష్యప్రశిష్యులకు సంక్రమించినది. శిష్యబాహుళ్యము శాఖాబాహుళ్యమునకు తావిచ్చి ఇది సహస్రశాఖలుగా విస్తరిల్లెను. ఒకప్పుడు దీనికి ఉదీచ్యప్రాచ్యశాఖ లని రెండు ముఖ్యశాఖా భేదములుండెను. కాని నేడు సామవేదులు దాక్షిణాత్య ప్రతీచ్యశాఖానుయాయులుగనే కాన్పింతురు. శాఖలు కూడ మూడే మిగలినవి. వానిలో కౌథుమశాఖ గుజరాతులోని నాగర బ్రాహ్మణులలో నిలిచినది. రాణాయణీశాఖ మహారాష్ట్రములోను, దక్షిణమున రామేశ్వర ప్రాంతమునను మిగిలినది. జైమినిశాఖ కర్ణాటకమున ప్రచారములో నున్నది. ఈ మూడింటి సంహితలును అచ్చయినవి.

ఈ సంహిత పూర్వార్చికమనియు, ఉత్తరార్చికమనియు రెండు భాగములు. పూర్వార్చికమునకు ఛందసీ, ఛాందసికా అని కూడ నామాంతరములున్నవి. ఇది 6 ప్రపాఠకములుగా విభక్తమయినది. ప్రతి ప్రపాఠకమునకు రెండధ్యాయములు (అర్థములు)ను, అవి తిరిగి (కొన్ని ఖండములు) ఛందోదైవతాదికము ననుసరించి సంకలితము చేసిన పదేసి మంత్రములుగను విభజింపబడెను. మొదటి అయిదు ప్రపాఠకములును ఆగ్నేయ ఇంద్ర పవమానపర్వములకు సంబంధించును. ఆరవ ప్రపాఠకములో ఆరణ్యక పర్వము లున్నవి. ఉత్తరార్చికము కూడ 9 ప్రపాఠకములుగను, 29 అధ్యాయములుగను విభజింపబడినది. దీనిలో దశరాత్ర, సంవత్సర, ఏకాహ, అమీన, సత్ర, ప్రాయశ్చిత్త, క్షుద్రభాగములు వర్ణింపబడినవి. రాణాయణీయ సంహిత కూడ ఇదే పద్ధతిలో పూర్వార్చికము 6 ప్రపాఠకములుగను, ఉత్తరార్చికము 9 ప్రపాఠకములుగను విభజింపబడెను. ఉత్తరార్చికలో మొదటి 5 ప్రపాఠకములకు రెండేసి అర్థములు చివరి నాల్గింటికి మూడేసి అర్థములును ఏర్పడినవి. ప్రతి అర్థమును కొన్ని దశతులు (ఖండములుగా) విభజింపబడెను.

పూర్వోత్తరార్చికములు రెండింటిలోను గల 1875 మంత్రములలోను కొన్ని మంత్రములు పునరుక్తములై వినిపించును. ఇంచుమించుగా మంత్రములన్నియు ఋగ్వేదములోనివే. 75 వరకు కౌథుమిలో ఋగ్వేదీయ శాఖలసంహితలో లేని మంత్రములున్నవి. కౌథుమశాఖలోనే తాండ్యశాఖ అంతర్గతమనియు, తాండ్యబ్రాహ్మణము దీనికి సంబంధించినదనియు చెప్పుదురు. రాణాయణీయములో ఉచ్ఛారణభేదము గోచరించును. కౌథుమిలో హా ఉ, రా ఇ అని ఉచ్చరించినవి ఇందులో హా వూ, రా యీ అని ఉచ్చరింపబడును. సౌత్యాముగ్రిశాఖ దీని అవాంతరశాఖ, దీనిలో హ్రస్వ ఎ ఒ అక్షరములు వినిపించును. జైమినీయ సంహితలో కౌథుమీయ సంహితలోకన్న మంత్రములు తక్కువగా నున్నను గానములు ఎక్కువగా కనిపించును. తలవకారశాఖ దీనికి అవాంతర శాఖ. కేనోపనిషత్తు ఈ శాఖకు సంబంధించును.

సామసంహితలన్నియు, ఆర్చికములనియు, గానములనియు రెండు విధములు. ఋక్కులకే ఆర్చికములని పేరు. కాగా, ఆర్చికములలో సామగానమున కుపకరించు మంత్రములన్నియు సంగ్రహింపబడినవనియు, గానసంహితలో అవేమంత్రములు గేయరూపములో సంతరింపబడినవనియు తెలియనగును. సామగానము 4 విధములు. 1. గ్రామగేయగానము. ఇది గ్రామములో పాడదగినది. దీనిని వేయగానమని కూడ పేర్కొందురు. (2). అరణ్య గేయగానము. ఇది అరణ్యములో పాడదగినది. గ్రామగేయ, అరణ్యగేయములకు ప్రకృతిగానములను వ్యవహారము. వీని ననుసరించి (3) ఊహాగానము (4) ఊహ్యాగానము అనునవి వికసించును. మొదటి రెండును పూర్వార్చికమునకును, చివరి రెండును ఉత్తరార్చికమునకు సంబంధించును. సామగానవిధానము ఉత్తరార్చికములో కొంత వివరింపబడినది. ఋక్ ప్రాతిశాఖ్య, తైత్తిరీయ బ్రాహ్మణ, సామవిధాన బ్రాహ్మణ, పుష్పసూత్ర, సామసూత్ర, నారదశిక్షాదులలో మరికొంత విస్తారముగా ఈ విషయము వర్ణింపబడినది.

నారదీయశిక్షలో సామస్వరములు 7 చెప్పబడినవి. అట్లే 3 గ్రామములు, 21 మూర్ఛనలు, 49 తానములు పేర్కొనబడినవి. సామసప్తస్వరములు వేణువులో వరుసగా 'మ గ రి స ని ధ ప' అను స్వరములకు సరిపోవును. సామగాన పాఠములలో స్వరములు 1 నుండి 7 వరకు అంకెలు వేసిచూపబడును. ఉచ్చైస్తారమను స్వరము 11 అంకెతో చూపబడును. సామమంత్రములలో స్వరచిహ్నములుంచు పద్ధతి దీనికి భిన్నము. గాన భాగములో సంగీతానుకూలముగా చేసిన మార్పులు సామవికారములని పిలువబడును.

సామగానములో పదములు విరిచి చదువునప్పుడు ఛందస్సుగాని, అర్థముగాని గమనింపరు. 'సామవేదే గీతి ప్రధానే ఆవృత్తిష్వర్థో నాద్రియతే' అని సామగాన ప్రసంగములో అర్థముతో నిమిత్తములేదని స్పష్టముగా చెప్పబడినది. ఛాందోగ్యములో సామగానము హింకార, ప్రస్తావన, ఆది, ఉద్గీథ, ప్రతిహార, ఉపద్రవ, నిధనభాగములు కలదిగా చెప్పబడినది. హింకారము ఓంకారతుల్యము. ప్రస్తావమనునది ఆరంభగానము. దీనిని ఋత్విజు డారంభించును. ఉద్గీథ ఓంకారము. దీనిని ఉద్గాత పఠించును. ప్రతి హారమనగా రెండింటిని

కలుపునదని అర్థము. దీనిని ప్రతిహర్తచదువును. ఒకప్పుడిది రెండుగా విరిచి చదువుదురు. అందొక భాగమునకు ఉపద్రవమని పేరు. దీనిని ఉద్గాత గానము చేయును. నిధనమనునది మంత్రములోని అంతిమ భాగము ఓంకారము. దీనిని ఋత్విజులు ప్రస్తోత, ఉద్గాత, ప్రతిహర్త ముగ్గురు చదువుదురు.

నాలుగు వేదములకు నాలుగు ఉపవేదములున్నవి. 'తత్రర్వేదస్య ఆయుర్వేద ఉపవేదః, యజుర్వేదస్య దనుర్వేదః, సామవేదస్య గాంధర్వవేదః అథర్వవేదస్య శస్త్రశాస్త్రాణి' ఇత్యాది వచనముల ననుసరించి సామవేదమునకు గాంధర్వము ఉపవేదముగా చెప్పబడును. గాంధర్వమనగా గానకళ. ఛాందోగ్యములో ఘోర అంగిరసు డను ఋషి దేవకీపుత్రుడైన శ్రీకృష్ణునికి వేదాంతవిద్య ఉపదేశించినట్లు చెప్పబడినది. శ్రీకృష్ణుడీ విద్యను నుపాసించి చాలిక్యగానమును వెలయించెననియు, అది యాదవులలో ప్రచారమందినదనియు, మురళిపై కృష్ణుడీ గానమునే వినిపించెవాడనియు చెప్పుదురు. ఏది ఎట్లున్ననూ సామవేదము గానకళకు మూలమనుట తథ్యము. సామసప్తస్వరములకు వేణువుపై నూదబడు స్వరస్థాయీ విన్యాసములో గల పోలికలు నారదీయశిక్షాదులలో వివరింపబడినవి. కాని నేడు సామగానము చేయు పద్ధతిలో ఈ స్వరములు సుస్పష్టముగా తెలియవు. శాస్త్రమునకు వ్యవహారమునకును కొంత ఎడమున్నట్లును, అది సంప్రదాయభేద మూలకమని అంగీకరించి వ్యవహారమే బలీయమని చెప్పుదురు.

యజ్ఞములో సోమపానమెంత రుచ్యమో సామగాన మంత మధురము. దేవతాస్తోత్రపరముగా ఆ యా సామములు గొంతెత్తి పాడుచున్నప్పుడు ఉద్గాత్రాది ఋత్విజుల ఉత్సాహము సభికులను కూడా ఉత్సాహపరచుచుండును. ఒకానొక రసాత్మకమైన వాతావరణము యాగశాలయందంతటను నెలకొనును. ఈ గానరసమునకు సోమరసము చేయూత ఇచ్చినట్లుండును. యజ్ఞములో సోమాహరణాది ప్రసంగములు చాల రసవంతములు. సోమమనునది ఒక లత. ఋగ్వేదములో ఈ లత మూజవానపర్వత ప్రాంతముననను, కురుక్షేత్రములోని శర్యణావత్ ప్రదేశములలోను దొరుకునని చెప్పబడినది. ఇది నదీతీరములలో నాచువలె పెరుగునట. పర్వత ప్రాంతములలో లతవలె పెరుగునట. దీనికి పర్వతావృధ, గిరిష్ఠ మున్నగు పేర్లు చెప్పబడినవి. చంద్రునితో సామ్యము చెప్పి చంద్రకళలతోపాటు పెరుగుచు తరుగుచునుండు ఆకులు గలదిగా వర్ణింపబడినది. కొందరిది అరటి దుంపవంటి దుంప అనియు, లతగా ప్రాకుననియు, నీటిలో తేలుననియు, దీనికి 15 అకులుండుననియు, అధర్మపరుల కిది కనబడదనియు చెప్పుదురు. నిజమున కిది ఈనాడు కనబడదు. ఆపస్తంబుని నాటికే ఈ లత దేశములో మృగ్యమైనట్లున్నది. అతడే దీనికి అనుకల్పములు చెప్పను. ఈ అనుకల్పవిధిననుసరించి ఈనాటి యజ్ఞములలో సోమలతకు మారుగా కారుగచ్చునో తిప్పతీగనో వాడుదురు.

సోమయాగములలో సోమాహరణమే ఒక పెద్ద కలాపము. సోమాహరణ సూక్తములకు సౌపర్ణసూక్తములని పేరు. సోమలతను అధ్వర్యుడును యజమానియు కొందరు. దానిని 36 అంగుళముల పొడవు, 18 అంగుళాల వెడల్పు గల

అభిషవణఫలకము మీద కృష్ణాజినము పరిచి, దానిపై నుంచెదరు. ఆ మీద దాని నభిమంత్రించుచు నీటితో తడుపుచు నాలుగు శిలాయంత్రములతో నూరుదురు. తరువాత దానిని ఆహవనీయపాత్రలో వేసి నీరు ఓడ్చి లతను పిండి నీళ్ళలో కలుపుదురు. కసవు తీసిన తలకు 'ఋజీష' అని పేరు. దీనిని దశాపవిత్ర వస్త్రములో మూటగట్టినట్లు కట్టి రసము ధారగా పడునట్లు వడియగట్టుదురు. ఈ విదముగా పిండిన రసము ముందు దేవతలకిచ్చి హోమము చేసి వషట్కారములు చెప్పుదురు. ఆ మీద హోమావశేషమును ఉద్గాత, యజమాని, బ్రహ్మ గ్రహింతురు. ఆ యా దేవతల కర్పించునపుడు సోమరసము పాలు, పెరుగు, నేయి, సువర్ణరజము మున్నగువానితో కలిపి అర్పించెదరు. యజ్ఞదినములలో ఈ కలాపము దినమునకు మూడు పర్యాములు జరుపుదురు. సోమరసమును మధువని, మధుమత్ అనీ, పీయూషమనీ వ్యవహరింతురు. ఆ యా వస్తువులు కలిపినపుడు దీనిని ఆశిర, గవాశిర, యవాశిర మున్నగు పేర్లతో వ్యవహరింతురు.

సుశ్రుతుములో సోమరస భేదములు ఇరువది నాలుగు వరకు వేదోక్తములుగా వర్ణింపబడినవి. ఇది సువర్ణపాత్రలో త్రాగవలసినదిగా చెప్పబడినది. దీనివలన హర్షోత్సాహములేకాదు బ్రహ్మజ్ఞానోదయమున కనుకూలించు స్వస్థత కలుగునని వివరింపబడినది. ఇది అమృతము. విశుద్ధ బుద్ధియు చిత్తస్వాస్థ్యమును, నిర్మల జ్ఞానమును కలుగును. పైగా ఆధ్యాత్మికముగా అర్థము వివరించునప్పుడు సోమరసమునకు నిర్మలజ్ఞానము, బ్రహ్మానందరసము మున్నగు సాంకేతికార్థములు గ్రహింతురు.

గానము ప్రణవనిర్భరమై, తత్పరిణామమై, తదేకాలంబనమై వెలయుచుండుటచేత సామము సర్వోత్కృష్టమైన విద్యగా భావింపబడుతున్నది. ఛాందోగ్యమున సామసారమగు ఉద్గీథవిద్య, ఆధ్యాతిక, ఆధిదైవిక, ఆధిభౌతిక సంపదలకు మెరుగు సమకూర్చినదిగా వర్ణింపబడినది. సోమయాగములో సోమదేవతాకమైన మంత్రములెన్నియొ సామవిధానము ననుసరించి గానము చేయబడును. బహిష్పవమానాది సూక్తములవంటి (ఋత్విజులందరు సామూహికముగా గానము చేయునట్టి) ప్రసంగము లీ యజ్ఞములోవలె దర్శ, పూర్ణమాసాదులలో కలుగవు. ఇట్లే యజమాని కిష్టకామ్యార్థము లొనగూర్చుటకై, ఆ యా దేవతల నుద్దేశించి తత్తత్ స్తుతిపరములైన సూక్తములు గానము చేయుదురు. సామము దేవతలకు ప్రియమైనది. లోకవ్యవహారములో కూడ సామమనగా ప్రియము పలుకుట, నయము సమకూర్చుట అనియే అర్థము. శ్రుతి కూడ 'యత్ ఖలు సాధు తత్ సామ' అని ఏది సాధువో అనగా ఏది శుభావహమో శోభనమో అదియే సామమని కీర్తించినది. (సశేషం)త్రీ

> - గురుబోధనలను భక్తి విశ్వాసాలతో గ్రహించటం మరలా మరలా చదవటం (మననం చేసుకోవటం) వాటిని శ్రద్ధగా ఆచరణలో పెట్టటం జరగాలి. అట్టివారు ఉన్నత ఫలితాలను అందుకోగలరు.
> - స్థిర సంకల్పం కలిగినవారు మాత్రమే భక్తిమార్గంలో విజయం సాధించగలుగుతారు.

# సుశీల కథ

... గోనుగుంట మురళీకృష్ణ

అది గుంటూరు జిల్లాలోని తెనాలి పట్టణం, కృష్ణానదీ పాయలు మూడు పట్టణం మధ్యలో సమాంతరంగా ప్రవహిస్తున్నాయి. ఆ నీటి మీద నుంచీ వచ్చే చల్లని గాలి ప్రజలందరికీ వింజామర వీస్తున్నట్లుగా ఉన్నది. ఎటుచూసినా పచ్చటి చెట్లతో, పంటపొలాలతో సస్యశ్యామలంగా ఉంది ఆ ఊరు. భూదేవి స్తన్యంలాంటి పరిశుద్ధమైన జలం త్రాగటం వల్ల ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలు జరిగేటప్పుడు రెండవ భద్రాచలం అనీ, శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరిగేటప్పుడు చిన్న తిరుపతి అనీ, కవులు, రచయితలతో సాహితీ సభలు జరిగేటప్పుడు భువన విజయమనీ తెనాలి ప్రజలు తమ ఊరిని ఎవరికిష్టమైనట్లు వారు పిలుచుకుంటూ ఉంటారు. అందరూ ధర్మబద్ధులై, సాధువర్తనంతో ప్రశాంతజీవనం గడుపుతూ ఉన్నారు.

మునిమాపు వేళ. పాండు రంగస్వామి దేవాలయంలో జేగంటలు మ్రోగుతున్నాయి. ఆలయ ప్రాంగణం అంతా కడిగి శుభ్రం చేసి ఉన్నది. చల్లగాలికి పూలమొక్కలు తలలూపుతున్నాయి. కొబ్బరి చెట్ల మాటు నుంచీ చంద్రోదయం అవుతోంది. ఆ గుడి సమీపంలో నివసించే స్త్రీలందరూ స్నానం చేసి ఉతికిన బట్టలు ధరించి పూజాద్రవ్యాలు పట్టుకుని శుచిగా వచ్చారు. ఒకామె కొబ్బరికాయలు నైవేద్యంగా తెచ్చింది. మరొకామె అరటిపండ్లు తెచ్చింది. ఇంకొక స్త్రీ పాలు తీసుకువచ్చింది.

''పూజారి గారూ! ఈ రోజు స్వామి వారికి సమర్పించటానికి మా ఇంట్లో ఏమీ లేవు. ఈ సువర్ణగన్నేరు పువ్వులు మాత్రమే ఉన్నాయి'' అన్నది పేదరాలైన ఓ స్త్రీ.

"ఫర్వాలేదు తల్లీ! పువ్వులు తెచ్చావు కదా! అంతకన్నా ఏం కావాలి ? అవికూడా లేనినాడు ఆకులే తీసుకురా! ఆకులు కూడా అందుబాటులో లేనప్పుడు ఒక పాత్ర నిండా నీళ్ళు తెచ్చినా చాలు. పత్రం, పుష్పం, ఫలం, తోయం అన్నారు. భక్తితో ఏది సమర్పించినా భగవంతుడు ఆనందంగా స్వీకరిస్తాడు'' అని అవి అందుకుని గర్భగుడిలోకి వెళ్ళాడు పూజారి.

పూజారి పూజ చేస్తుంటే అందరూ వరుసగా నిలబడి చేతులు జోడించి స్వామివారి వంకే చూస్తున్నారు. పూజ ముగిసిన తర్వాత హారతిని కళ్ళకద్దుకున్నారు. పూజారి శఠగోపం పెట్టి అందరి తలల మీద అక్షతలు చల్లాడు.

ఆడవాళ్ళంతా కూర్చున్నారు. ''పూజారి గారూ! ప్రతి రోజూ పురాణ కథలు చెపుతూ మాకు తెలియని ఎన్నో విషయాలను తెలియజేస్తున్నారు. ఈ రోజు పాండురంగస్వామి మహిమలను తెలిపే కథని వినగోరుతున్నాము'' అన్నది ఒకామె.

"అంతకంటేనా ? స్వామి కథలు వినటం, చెప్పటం ఎవరికైనా ఆనందదాయకమే! వినండి. శ్రీమహావిష్ణువు పాండు రంగడు అనే పేరుతో వెలసిన ప్రదేశమే పౌండరీకక్షేత్రం. అక్కడ ఎందరో భక్తుల కథలు

ఉన్నాయి. అలాంటి వారిలో ఒకరు సుశీల. సుశీల ఒక వైష్ణవ భక్తుని కుమార్తె. తల్లిదండ్రుల ప్రేమలో, లాలనలో అల్లారు ముద్దుగా పెరుగుతూంది. సుశీలకు వివాహ వయసు రాగానే దేవదత్తుడు అనే వాడికి ఇచ్చి వివాహం చేశారు. సుశీల, దేవదత్తులు పుండరీక పురంలో కాపురం పెట్టారు. దేవదత్తుడు కోపిష్టి, పిసినారి, అసూయాపరుడు, చంచల బుద్ధి కలవాడు. అతడి గుణగణాలను సరిగా విచారించకుండానే సుశీల తల్లిదండ్రులు తమ కుమార్తె నిచ్చి వివాహం చేశారు. అయినా సుశీల, తల్లిదండ్రులను నిందించకుండా భర్త పెట్టే బాధలను సహిస్తూ 'అంతా తన విధి" అనుకుని కాలం గడుపుతూ ఉంది. ఇలా ఉండగా ఒక రోజు ....

"అమ్మా! ఇంట్లో ఎవరు తల్లీ!" అని బయట నుంచి పెద్ద కేక వినిపించింది. వంటగదిలో పని చేసుకుంటున్న సుశీల బయటకు వచ్చింది. అక్కడ ఒక బ్రాహ్మణ బాలుడు, పదిహేను సంవత్సరాల వయసుంటుందేమో నుదుటికీ, భుజాలకీ వీబూధి రేఖలు పెట్టుకుని ఉన్నాడు. భుజానికి ఉన్న కర్రకు పెద్దమూట వేలాడుతూ ఉంది.

"ఎవరు నాయనా నువ్వు?" అని అడిగింది సుశీల.

"అమ్మా! నేనూ, నా తోటి బ్రహ్మచారులూ తీర్థయాత్రలకు వెళుతున్నాం. దారిలో ఆహారం దొరకక, ఆకలికి తాళలేక మీ ఇంట తినటానికి ఏమైనా దొరుకుతుందేమో అని ఇలా వచ్చాను. నా తోటి వారందరూ ఆకలితో ఉన్నా, ఎలాగో సాహసించి ముందుకు వెళ్ళిపోయారు. నేను త్వరగా వెళ్ళి వాళ్ళని కలుసుకోవాలి" అన్నాడు.

"అయ్యో! అలాగా! ఈ చెట్టుక్రింద కూర్చుని విశ్రాంతి తీసుకోనాయనా! ఇప్పుడే వంట చేసి త్వరగా వడ్డించేస్తాను" అన్నది సుశీల.

"అంతసేపు ఆకలి బాధకు ఓర్వలేనమ్మా! భోజనం చేసి ఐదురోజులైంది. ఏ పండో, ఫలమో ఇచ్చి ప్రాణాలు నిలబెట్టు" అంటూ బ్రతిమిలాడాడు.

సుశీల ఇంట్లోకి వెళ్ళి దోరగా మగ్గిన జామపండ్లు రెండు తెచ్చి ఇచ్చింది. వాటిని భుజించి "అమ్మా! ఈ రెండు పండ్లతో ఆకలి బాధ తీరకపోగా, ఆకలి ఇంకా విజృంభించింది. ఇంట్లో ఏమైనా ఉంటే ఆఖరికి రాత్రి మిగిలిన చద్ది అన్నమైనా ఫర్వాలేదు. తీసుకువచ్చి పెట్టు. బ్రతికి ఉంటేనేకదా మనం ఏమైనా మంచి పనులు చేయటానికి ?" అన్నాడు.

సుశీల భర్త నిన్ననే ఊరికి వెళుతూ ఆమెకు రెండు పిడికిళ్ళు బియ్యం తీసి ఇవతల పెట్టి ధాన్యం, నిత్యావసర వస్తువులు ఉన్న గదికి తాళం వేశాడు. నిన్న అన్నం వండుకున్నా భర్త భుజించకుండా తను తినకూడదు కనుక సుశీల ఆ అన్నం అలాగే ఉంచేసింది. రాత్రి మిగిలిన ఆ అన్నం తెచ్చి ఆ వటువుకి అందించింది.

అది తిన్న తర్వాత, "నా ఆకలి ఇంకా తీరలేదు. ఇంట్లో ఇంకా ఏమైనా పెట్టు. నాతోటి వారందరూ చాలా దూరం వెళ్ళి ఉంటారు. నేను పరుగెత్తుకుంటూ వెళ్ళి వాళ్ళను కలుసుకోవాలి. నన్ను త్వరగా పంపించు" అన్నాడు.

సుశీల వంటగదిలోకి వచ్చింది. వంట పాత్రలు, డబ్బాలు వెతికింది. ఏమీ దొరకలేదు. "అయ్యో! ఇప్పుడు నేనేం చేయను ? "అభ్యాగత స్వయం విష్ణుః " అన్నారు కదా! ఆకలితో వచ్చిన వాడికి లేదని ఎలా చెప్పను ? " అని పరిపరి విధాల తలపోస్తూ విచారించింది.

కొద్ది సేపయిన తర్వాత "సకల జీవకోటికీ అన్నప్రదాత సూర్యభగవానుడు. నాకు ఆయనే దిక్కు"

అనుకుని సూర్యుణ్ణి ప్రార్థించింది సుశీల.

ఆ పతివ్రత ప్రార్థన విని ఆమె నిర్మలమైన అంతరంగానికి మెచ్చి సూర్యుడు అనుగ్రహించాడు. వెంటనే రకరకాల పాత్రల నిండా వరి అన్నం, కూరలు, పాయసం, గారెలు, బూరెలు, పులిహోర, పెరుగు వంటి భక్ష్యాలతో ఇల్లంతా నిండిపోయింది.

ఆమె ఆ బ్రాహ్మణ వటువుకి "ఇక చాలు" అనే వరకు వడ్డించింది. ఆ బ్రాహ్మణుడు సంతృప్తి పడి లేచాడు. వెంటనే బ్రహ్మచారి అదృశ్యమై ఆ స్థానంలో వేణువు చేతబూని, పింఛం ధరించి నీలి మేఘం లాంటి దేహఛాయతో శ్రీకృష్ణుడు ప్రత్యక్షమైనాడు.

సుశీల సంభ్రమాశ్చర్యాలతో ఆయనకి మొక్కింది. "సతీ! నిన్ను పరీక్షించటానికే నేను మాయా విప్రుని వేషంలో వచ్చాను. నీవు నా గురించి ఒక విశిష్టమైన పని చేశావు. అందుకే నీకు ఇటువంటి సత్ప్రవర్తన కలిగింది. పూర్వజన్మలో నీవు ఒక మునీశ్వరుడి ఆశ్రమంలో కామధేనువుగా జన్మించావు. ఆ సమయంలో నేను వేణుగానం చేస్తూండగా నీవు నా గానానికి మైమరచి పాలధారలు స్రవించావు. ఆ పాలధారయందలి కొన్ని బిందువులు నా శిరసుపైన పడి నాకు క్షీరాభిషేకం చేసిన ఫలం నీకు దక్కింది. నిన్ను పరీక్షించాలనే నీ భర్తకు క్రోధము, లోభము, మూర్ఖత్వము మొదలైన దుర్గుణాలను కలిగించాను. ఇకనుంచి నీ భర్తకు సద్బుద్ధి కలుగుతుంది. ఈ పుండరీక క్షేత్రంలో నివసించటం వల్ల మీ ఇరువురి కర్మశేషం నశించింది. కొంతకాలం సుఖంగా గడిపిన తర్వాత నా సన్నిధికి చేరుకుంటారు." అని చెప్పి అంతర్ధానమయ్యాడు రాధాలోలుడు.

దేవదత్తుడు ఊరినుంచి తిరిగి వచ్చిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగసాగాడు. నిత్యం అతిథి అభ్యాగతులను ఆదరిస్తూ, అన్నదానం చేస్తూ కొంత కాలానికి వారిద్దరూ విష్ణు సాన్నిధ్యానికి చేరుకున్నారు అంటూ కథ ముగించాడు పూజారి.

"పూజారి గారూ! సుశీల వంటి సాధ్వికి, పుణ్యాత్మురాలికి మంచి భర్త ఎందుకు లభించలేదు? ఆమెను పరీక్షించాల్సిన అవసరం శ్రీకృష్ణుడికి ఎందుకు వచ్చింది ?" అని అడిగింది ఒక స్త్రీ.

"మానవులు కష్టాలు వస్తే కానీ భగవంతుని తలచుకోరు. సుశీలకు మంచి భర్త, సుఖమయమైన సంసారం ఉంటే తనని మరచి పతితురాలవుతుందేమోనని ఆమెను పరీక్షించేందుకే కొన్నాళ్ళు ఆ కష్టాలు కల్పించాడు" అన్నాడు పూజారి.

"తర్వాత ఆయన పరీక్షలో నెగ్గింది. సుఖపడింది" అన్నది మరొకామె.

"అవును. బాగా చెప్పావు" అన్నాడు.

"ఇక వెళ్ళివస్తాం. ఈ రోజు మా మనసు ఎంతో ప్రశాంతంగా, ఆనందంగా ఉంది" అని కృతజ్ఞతలు చెప్పి అందరూ ఇళ్ళకు వెళ్ళిపోయారు. ☐

- గురువును సందేహించే వారికి యోగం ప్రాప్తించదు. కొందరికి ప్రాప్తించినట్లు ఉంటుంది. (ఎండమావులలో నీరులాగా) . ఆ భ్రమతోనే వారు కాలం వెళ్లదీస్తారు.
- తన బాగును కోరేవారు దాని ద్వారా ఇతరులకు అపకారం జరుగకుండే విధంగా చూచుకోవాలి. అదే తన అభివృద్ధికి సరైనదారి అవుతుంది.
- ప్రపంచ (భౌతిక) విషయాలు అవసరమైనంత వరకే చూచుకొని మిగిలిన సమయమంతా ధ్యానం చేసి స్వామివారి, అమ్మవారి దర్శనం పొందాలి.

# ఏకో దేవో దేవకీ పుత్రేవ

డా॥ ధారారామనాథశాస్త్రి

ఏకోదేవో దేవకీ పుత్రేవ... అన్నది ఎందుకు ?

'అంశావతారా అన్యేషుకృష్ణస్తు భగవాన్ స్వయం, ఆ భగవానుడు చెరసాలలో పుట్టి వ్రజసీమలో మెట్టి నిందకుట్ర వైరుధ్యము ఎదుర్కొంటూనే పెదవుల పై చిరునవ్వు కన్నుల్లో వెన్నెల ఏమాత్రం చెదరకుండా ఒకవైపు పూతనాది యాతుధాన యక్ష రక్షస్సంహారంచేస్తూ, ఒకవైపు గోప బాలకులు ఆధారంగా మైత్రీమాధుర్యాన్ని జగత్తుకు రుచిచూపిస్తూ, జన్మాంతర ఋష్యంశ సంభూతిగల గోపికలకు రాసీనృత్య మిషతో సన్నిధి కటాక్షిస్తూ, మరోవైపు గిరి యజ్ఞము అనే ఒక సామాజిక ఆధ్యాత్మిక సాధన ఉపదేశిస్తూ అవసరమైనపుడు అంత చిన్న తనంలోనే గంభీర తాత్త్విక విషయాలను ప్రవచిస్తూ బాలకృష్ణుడై అందరికీ ఆనందం పంచినందుకు...

పెరిగి పెద్దవాడై జగదేక శృంగార నాయకునిగా అష్టప్రకృతి తత్త్వాల అధిష్ఠాత్రలైన ఎనిమిది మంది దేవేరులను పరాప్రకృతియై తనలో భాగంగానే ఉన్న రాధను, పదునారు వేలనూరుగా సంప్రదాయంలో గనింపబడిన వివిధ రస, భావతత్త్వాలైన నాయికలను చేబట్టి బహుపత్నీ రూప జీవాత్మరతుడై భాసిల్లిన అనన్య శృంగారమూర్తి అయినందుకు...

క్షాత్రమూర్తిగా రాయబారం నుండి రణరంగం వరకు అనన్య నైపుణ్యంతో, అసామాన్య దీక్షాదక్షతలతో వ్యవహరించి తాను స్వయము సంహరించిన దుష్టనాయకులేకాక అటు కురుక్షేత్ర సంగ్రామం ద్వారా, యిటు యదువంశ వినాశం ద్వారా దుష్కృతులను వినాశనం చేసి ద్వాపరాంతాన రానున్న కలియుగానికి అనుకూలమైన ధర్మసంస్థాపనం చేసి సంభవామి యుగే యుగే... అన్న తన వాగ్దానం చెల్లించుకున్నందుకు ........

దయాకృష్ణ తత్త్వానికి తగినరీతి చిన్న నాటమాలాకారుని మొదలు అవతార సమాప్తికి ముందు ఉత్తరాగర్భరక్షణం వరకు ఎందరు ఆర్తులనో ఎందరు శరణాగతులనో చేరదీసి లాలించి కన్నీరు తుడిచి తత్తత్కాలాలకి వాళ్ళడిగిన చిన్నచిన్న కోరికలను'... ఏ యుథావూంవ్రపద్యంతే తాంస్తధైవభజామ్యహమ్'... అన్నగీతావాక్యానుసారం తీరుస్తూనే పర్యవసాన దశలో బోలెడంత మంది ఆర్తులను, అర్థార్థులను, జిజ్ఞాసువులను, జ్ఞానులను, మోక్షపదవే భ్రాజిష్ణులుగా మలచినందుకు...

బాల్యం నుండీ యధా సందర్భంగా మంచి మాటలు చెప్పి చెప్పి చివరకి ఒక్కసారి కురుక్షేత్ర సంగ్రామపూర్వ రంగంలో విషాద భావావిష్టుడైన అర్జునుని నిమిత్తంగా చేసుకొని జగత్తుకు అనన్యమైన భగవద్గీతను కటాక్షించి అందులో కర్మభక్తి జ్ఞాన వైరాగ్య మార్గాల ద్వారా సాదన చేసి ఎల్లకాలము ఎల్లమానవులు అధ్యయన, ఆచరణ ఫలితంగా తరించడానికి ఒక వెలుగు బాటను వేసి మానవులపట్ల తనకున్న కరుణా తత్త్వాన్ని నిరూపించినందుకు...

నీలమేఘశ్యాముడు
నిరిద్ర గుణధాముడు
నిరంతరహ సన్ముఖుడు
నిత్య సత్యస్వరూపుడు
నిరంతర వేణుగానలోలుడు
నిఖిల మానవ హృదయధాముడు

ఇలా ఎన్ని మాటలు చెప్పి తరగణి శాశ్వత విభూతిలో జగద్రక్షకుడై మనలో వెలుగొందుతున్నందుకు.... □

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

## ఆదిగురువు - ఆచార్య శంకరులు

**ఆచార్య - కుమారిలభట్టు సమాగమం**

ఆచార్యులు వ్యాసమహర్షి అనుమతితో దిగ్విజయ యాత్రకు సంకల్పించారు. చిద్విలాసీయం ప్రకారము ఆచార్యులు బదరీ నుండి కాశీకి వచ్చినప్పుడు ఆయనకు ఒకరు రత్నపాదుకలను, ఒకరు బంగారు కమండలాన్ని, కొందరు కాషాయ వస్త్రాలను, మరికొందరు ఏకాక్ష రుద్రాక్ష మాలలను, ముత్యాల సరాలను ఇచ్చారట. ఇలా ప్రజలు ఇచ్చిన వాటన్నిటినీ ఆచార్యులు చంద్రమౌళీశ్వర రత్నగర్భగణపతికి అర్పించేవారట. ఈ సంగతి తెలిసిన కాశీరాజు విలువైన కిరీటాన్ని, రత్న ఖచితమైన బంగారు కేయూరాన్ని, శ్వేతచ్ఛత్రాన్ని, పల్లకిని, రెండు చామరాలను అర్పించి పుత్ర కళత్ర సపరివార సమేతంగా ఆయనను సేవించారట. ఆ రాజు 'పేరు రత్నసింహుడు' అని కూడా చెప్పబడింది. అప్పటి రాజుల ప్రోత్సాహము కూడా శంకర దిగ్విజయానికి కారణమన్న అభిప్రాయము కూడా వుంది. ఈనాటి మఠాధిపతులు కూడా ఇలాంటి గౌరవలాంఛనాలను గమనిస్తే ఆచార్యులకు అప్పట్లో అతటి గౌరవ మర్యాదలు జరిగివుంటాయని భావించడంలో సందేహం లేదు. ఎంతో మంది ఆయన శిష్యులుగా మారడంతో ప్రజలలో కూడా ఆయన పట్ల గౌరవాదరాలు పెరిగి వుంటాయని భావించడంలో కూడా ఆశ్చర్యంలేదు.

**శివపాషండి పరాభవము :**

ఆచార్యులు ఇంకా కాశీనగరంలో వుండాగనే ఆయనను వాదంలో గెలవడానికి అనేకమంది శివ పాషండులు వచ్చారని, ఆచార్యులు వారందరినీ ఓడించి లింగ, త్రిశూల, డమరుకాది చిహ్నాలు గల శివ పాషండులలోని దురాచారాలను తొలగించి అద్వైతులుగా మార్చారని చిద్విలాసీయంలోని, పదిహేనవ అధ్యాయంలో వ్రాయబడింది. అలాగే అనంతానంద గిరీయంలో కూడా శివసంకేతాలను ధరించిన ప్రతివాదులను ఆచార్యులు ఓడించారని చెప్పబడింది. ఈ ప్రస్తావన ఆనంద గిరీయంలో విపులంగా కనిపిస్తుంది. దీనిని బట్టి దక్షిణ భారతంలో తిలకధారణము, ఆయుధ ధారణ లాంటి సంప్రదాయాలు వుండేవని తెలుస్తుంది. బాహ్య వేషధారణను, బాహ్య ఆడంబరాలను నిలపటానికి ఆనందగిరి చాలా శ్రమపడ్డారని తెలుస్తుంది.

**కుమారిల భట్టు దర్శనం :**

ఆచార్య శంకరులకు తాము రచించిన భాష్యానికి కుమారిల భట్టు ద్వారా వార్తిక వ్రాయించాలని అభిలాష కలిగింది. అందువలన దక్షిణ దిక్కులోగల వింధ్యాచలానికి వచ్చి, అక్కడి నుండి ప్రయాగకు వచ్చారు. యమునానదిలో స్నానం చేసి కుమారిల భట్టును గురించి ప్రజల నుండి వివరాలు సేకరించి ఆయున్ను వెదకుతూ బయయలుదేరారు. కుమారిల భట్టు తాను చేసిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా అరణ్యంలో తన చుట్టూ పొట్టురాశి చేసుకొని

నిప్పంటించుకొని శిక్షను అనుభవిస్తున్నాడని తెలిసి నరానరి అక్కడికే వెళ్ళాడు. కుమారిలభట్టు ఆచార్యులను చూచి సంతోషంగా స్వాగతం పలికారు. శంకరులు కమండలంలోని నీటితో తుషాగ్నిని ఆర్పివేసి ఆయన సంగం కాలిన శరీరానికి ఉజ్జీవనం చేయడానికి ప్రయత్నించబోయినప్పుడు కుమారిలభట్టు ఆపి మీరు భాష్య రచన చేస్తున్నారని విన్నాను. అందుకు వార్తిక వ్రాయించాలన్నది నా అభిప్రాయం యితే నాకు ఆ అదృష్టంలేదు. బౌద్ధుల ద్వారా అధ్యయనం చేసిన నేను వారికి ధర్మద్రోహం చేశాను. జైమినీ ధర్మంలో అభినివేశం కలిగి కర్మద్వారానే ముక్తి అన్నదానిని స్థిరం చేయడానికి పరమేశ్వరుని నిరాకరించాను. ఈ రెండు తప్పులకు దేహాంత దేహాంత ప్రాయశ్చిత్తమే జరగాలి. ఫరవాలేదు. కర్మరుడైన నా శిష్యుడు మండనమిశ్రుని జయించగలిగితే అందరినీ జయించినట్లే అన్నారు. ఆచార్యులు అతనికి అద్వైతాన్ని ఉపదేశించి, అజ్ఞానాన్ని తొలగించి ఆకాశమార్గం ద్వారా మండవమిత్రుని ఇంటివైపుకుప్రయాణం చేశారు.

ఈ వృత్తాంతంలోని విషయాలను గమనించుదాం.

కుమారిలభట్టు ఉత్తరదేశం వాడా ? దక్షిణదేవం వాడా ? అన్న ప్రశ్నకు సరియైన ఆధారం లేదు. డా॥ విద్యాభూషణ్ గారు వ్రాసిన 'భారత న్యాశాస్త్ర చరిత్ర' ఆధారంగా బలదేవ ఉపాధాయ అనే పండితుడు టిబెట్ దేశపు తారానాధ వె॥ ఐతిహాసిక గ్రంథాలనుండి కొంత విషయాన్ని సేకరించాడు. దాని ప్రకారం కుమారిలభట్టు ధర్మకీర్తి అన్న రాజుకు బాబాయి. అతడు దక్షిణ భారతంలోని చూడామణి రాజ్యంలోని త్రిభులో పుట్టినవాడు. కుమారిలభట్టు శ్రీమంత గృహస్థుడై చూడామణి రాజు యొక్క గౌరవాదరాలకు పాత్రుడయ్యాడు. ధర్మకీర్తి కూడా కోరునందనుడనే బ్రాహ్మణ పుత్రుడు. బౌద్ధమతంపట్ల ఆసిక్తి వుండటంచేత నలందా విద్యాపీఠంలోని స్థవిర ధర్మపాలుని దగ్గర బౌద్ధశాస్త్రాన్ని అధ్యనం చేసి, బ్రాహ్మణ దర్శన జ్ఞానం కోసం కుమారిలభట్టు వద్ద చేరాడు. కుమారిల భట్టు భార్య అభిప్రాయం మేరకు ఇతర బ్రాహ్మణ శిష్యులతోబాటు అతనికీ అవకాశం ఇచ్చాడు. ధర్మకీర్తి రాస్త్రాధ్యయనం చేసి ప్రవీణుడై అక్కడున్న పండితులను తన వాదంతో ఓడించి, వారిని జయించి, ఆ తరువాత కుమారిలభట్టుతో కూడా వాదించి అతనిని కూడా ఓడించాడని, అందుకు పరిణామంగా కుమారిల భట్ట తన ఐదు వందల మంది శిష్యులతో బాటు బౌద్ధం స్వీకరంచాడని వ్రాయబడింది.

ఈ కథను మనదేశంలో సమర్థించేవారు లేరు. అలాకాక భట్టు బౌద్ధ దర్శనాన్ని తెలుసుకోవడానికి బౌద్ధాచార్యుల మధ్య బౌద్ధబిక్షువు వేషంలోనే వున్నాడని మాధవీయంలో చెప్పబడింది. కుమారిలభట్లుకు ధర్మపాలుడై వుంటాడని శ్రీ ఉపాధ్యాగారి అభిప్రాయం. భట్టు బౌద్ధాన్ని అభ్యసించే సమయంలో ఒకనాడు ఆ గురువు వైదిక మార్గాన్ని నిందించడం విని ఆయన కళ్ళలో నీల్ళు నిండుకున్నాయి. అది గమనించిన మిగిలిన శిష్యులు ఆయన బ్రాహ్మణుడేనని నిర్ధారించుకున్నారు. మంచి సమయం చూసి ఆయనను పై నుండి క్రిందికి తోఆరు. 'వేదాలు ప్రమాణమైతే నాకే అపాయమూ కలుగకూడదు' అని భట్టు గట్టిగా అరిచాడట. 'ప్రమాదమైతే' అన్న సందేహాన్ని వ్యక్తం చేయడం వల్లనూ, ప్రచ్ఛన్న వేషంలో శాస్త్రాధ్యయనం చేయడంవల్లనూ, ఒక కన్నుపోయిందని

మాధవీయంలోని వర్ణన చెబుతుంది.

ఈ రెండు సన్నివేశాలనూ గమనిస్తే ఆకాలంలో బౌద్ధులు, బ్రాహ్మణులు ఒకరి శాస్త్రాలను మరొకరు అధ్యయనం చేస్తూ వాదోపవాదాలు జరిపేవారని స్పష్టమౌతుంది. కుమారిలభట్టు దక్షినదేశం వాడనికూడా తెలుస్తుంది. కాని 'అనంతానంద గిరీయం'లో భట్టు ఉత్తరదేశం నుండి దుష్టమతావలంబులైన జైన బౌద్ధులను జయించారని, (భట్టాచార్యాఖ్యో ద్విజవరౌ కశ్చిత్ ఉదగ్దేశాత్ సమాగత్యా దుష్ట మతావలంబినో బైద్ధాన్ జైనాన్ అసంఖ్యాతాన్ రాజముకాత్ నేక విద్యా ప్రసంగ భేదైః నిర్జిత్య... నిర్భయో వతణతే అందువలన ఆయన ఉత్తరదేశం వాడని తెలుస్తూవుంది. శాలికానాధుడనే పండితుడు ఆయన ఉత్తరదేశంలోని వాడని చెప్పాడు. ందుకంటే 'వార్తిక కారమిశ్ర'. అన్నపేరా కూడా వుండటంచేత, మైధిలి బ్రాహ్మయెడని చెప్పబడటం చేత అతడు ఉత్తరదేశపువాడనే బలదేవ ఉపాధ్యాయుట' వ్రాశారు.

దక్షిణదేశంలో జైన బైద్ధుల ప్రాబల్యం ఎక్కువ కావడంతో అనేకమంది బైద్ధ విద్వాంసులు దక్షిణాది బ్రాహ్మణులుగా మారారన్న ఉదంతం ప్రాకరం కుమారిల భట్టు దక్షిణిదేశం వాడేనని కూడా నమ్మవచ్చు. కుమారిభట్టు యొక్క వేద ప్రామాణికతను ధర్మకీర్తి తన 'ప్రమావార్తిక'లో ఖండించాడు. ఇదే అభిప్రాయం గల రాహుల సాంకృత్యాయనుడి శ్లోకం ఇలా వుంది.

**అపౌరుషేయతాపీష్వా కర్తృణా మష్మృతే కిల ।**
**సంత్యస్యాప్యను వక్తార ఇతి ధిగ్ వ్యాపకం తమః॥**

ధర్మకీర్తి, కుమారిలభట్టు సమకాలికులు. కుమారిలుడికి మహాయానమే కాక హీనయాన బౌద్ధంతో కూడా పరిచయముంది. మ్లేచ్ఛులు ఉపయోగించే పదాలను కొంత మార్చి అర్ధాంతర వాచకంగా ప్రయోగించారు. ఉదా : అతర్ (మార్గము) వయిర్ )పొట్ట). వీటిని బట్టి ఆయునను దక్షిణదేశంవాడేనని నమ్మవచ్చు. అంతేకాక 'మిశ్ర' అన్నపదం సంస్కృతంలో గైరవసూచకం.

ఆచార్యులకు భట్టిపాదల గురించి తెలిసింద ఎక్కడ ?

మాధవీయంలో ఆచార్యులు భట్టును కలవడానికి, జయించడానికి ముందుగా ప్రయాగకు వచ్చారని (ప్రయాగ మార్గాత్ ప్రధమం జగీషుః కుమారిలం సాధిత కర్మజాలమ్) చెప్పబడింది.

చిద్విలాసీయంలో ఆచార్యులు కాశీలో వుంటూ దుర్మతులను ఖండిస్తూ ఆ వాదులను అద్వైతం వైపుకు మరలునస్తూ వున్నప్పుడు ఒక బ్రాహ్మణుడ........................... భౌదుల నుండి శిక్షణ పొంది వారి మతాన్నే ఖండిస్తున్నాడు' అని చెప్పాడు. ఆ మాట విన్న ఆచార్యులు ఆ బ్రాహ్మణుడితో బాటు రుద్ధనగరానికి వచ్చారని కూడా చప్పబడింద

అనంతానంద గిరీయంలో ఆచార్యులు శ్రీశైలంలో ఒక నెలపాటు వున్నారని, అప్పుడు రుద్ధనగరం నుండి బ్రాహ్మణులు వచ్చి 'భట్టాచార్యుడనే బ్రహ్మణ శ్రేష్ఠుడు ఉత్తరదేశం నుండి వచ్చి, దుష్టమతావలంబులైన ఆగణత జైనులను అనేక విద్యాప్రసంగములతో జయించి రాజు సహాయంతో వాటిని అణచివేస్తూ నిర్భయంగా వున్నాడు' అని చెప్పారని. ఆ అద్భుత సమాచారాన్ని విన్న ఆచార్యులు శిష్యసమేతులై రుద్ధనగరానికి వచ్చారని చెప్పబడింది. ఇలా ఆయనకు కుమారిల భట్టు గురించి తెలిసింది ప్రయాగలోనని, అదికాదు శ్రీశైలంలోననని విభిన్న అభిప్రాయాలున్నాయి.

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## తన జనన మరణాలను తానే చూచిన గాధి

''రామప్రభూ! అవధరించు. మాయ చాలా శక్తివంతమైనది. దురత్యయమైనది. దానికి అతీతంగా ఎవరూ జీవించలేరు. అసలు దాని స్వరూపస్వభావాలు ఎలా ఉంటాయో తెలిస్తే కదా. ఎవరైనా మాయాతీతులై మసలుకోవడానికి మార్గాలు వెదుకగలగడం. అందుచేత మొదట ప్రతివ్యక్తీ క్షుణ్ణంగా మాయా తత్త్వాన్ని అధ్యయనం చేయాలి. ఆ పిమ్మట పెద్దల వలన దాన్ని తరించే మార్గం తెలుసుకోవాలి. అంతవరకూ ముక్తి మాట అలా ఉంచు జీవనరక్తి కూడా సాధ్యంకాదు. ఈ అర్థాన్ని ప్రతిపాదించే ఒక చిన్న పురాణకథ ఉన్నది. చెబుతున్నా విను'' - అంటూ శ్రీ వసిష్ఠులు తమ ప్రవచనాన్ని కొనసాగించారు.

కోసల దేశంలో వేదవేదాంగవిదుడు, నిరంతర జిజ్ఞాసాపరుడు, నిత్య సాధకుడు, మహానైష్ఠికుడు అయిన గాధి అనే బ్రాహ్మణోత్తముడు జీవిస్తుండేవాడు. యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తూ శిష్యులకు విద్యా దానం చేస్తూ కుటుంబ విధులలో అప్రమత్తుడై ఆదర్శ జీవనం సాగిస్తుండేవాడు. అతడు ఒకనాడు తీరిక వేళ నగర బాహిర ప్రాంతంలో వ్యాహ్యాళికి వెళ్లి అలా అలా కొంత దూరం పరధ్యానంగా నడుస్తూ వెళ్లాడు. తరువాత తెలిసింది. అతనికి కోసల భూమిని దాటి చాలా దూరం వచ్చినట్లు సేదదీర్చుకుందామనుకుంటుండగా ఎదుర ఒక మహాద్భుత సౌందర్యముతో విరాజిల్లే ఒక మనోహరమైన సరస్సు కనిపించింది విశాలమైన సరస్సు స్వచ్ఛ జలాలతో వికసిత పద్మవనాలతో హంససారసాది విహంగ సమూహాలతో విరాజిల్లి తనను ఆహ్వానించినట్లుగా అనిపించింది. సరస్సులో దిగి అందలి మధుర జలాల్ని గ్రోలి తద్గత సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న గాధికి మనస్సులో మెరపు తీగెలాంటి ఒక ఆలోచన వచ్చింది. సంసార బంధాలు, నిత్యకృత్యాలు, జీవన ప్రణాళికలు, ఆలుబిడ్డలూ, ఆయవ్యయాలూ ఎప్పుడూ ఉండేవే. ఇప్పుడు ప్రశాంత మనోహర సరస్సు నన్ను ఆహ్వానించి ఆకర్షించి ఆప్యాయంగా తనలోనికి లీనం చేసుకుంటున్నట్లున్నది. ఇది ఒక ప్రశాంత శీతల మధురానుభూతి. ఈ సరస్సు రంగముగా నేనెందుకు స్వామిని గూర్చి తపస్సు చేయరాదు ?

అనే ఆలోచన వచ్చిందో లేదో గాధి అప్పటికప్పుడు ధ్యానభూమికలోకి వెళ్లిపోయాడు. తపస్సీమలోకి వెళ్లాడు. కాలంగాని, శీతోష్ణ సుఖదుఃఖాలు గాని, లౌకిక స్పర్శగాని లేని ఒక ఉదాత్త స్థాయిలో రమించాడు. అప్పటికి ఎనిమిది నెలలు గడువగా ఒకనాటి ప్రాతః కాలం శరదంబుజ లోచనుడు, నీలాంబుద వర్ణుడు, పీతాంబరధారి, శంఖచక్రాద్యాయుధ శోభితుడు, కోటి సూర్య ప్రభా భాసమానుడు అయిన విష్ణుమూర్తి ప్రత్యక్షమైనాడు. స్వామి దర్శనం చేత తన్మయభావాన్ని పొందిన గాధి నుతులా నతులా శ్రీమహావిష్ణువును ప్రసన్నం చేసుకున్నాడు. స్వామి ప్రీతుడై 'బ్రాహ్మణోత్తమా! ఏం కావాలయ్యా' అనగా గాధి, 'స్వామీ మీ దర్శనం లభించాక ఇంకా ఏమీ కావాలనిపించదు. కాని ఎన్నాళ్లనుండో

మాయాతత్త్వాన్ని తెలుసుకోవాలని జిజ్ఞాస పట్టి పీడిస్తున్నది. అనుగ్రహించండి', అన్నాడు. స్వామి చిరునవ్వుతో 'అదెంత భాగ్యం అలాగే' అని అదృశ్యుడైనాడు.

సరస్సునుండి యీవలకు వచ్చిన గాధి అఘమర్షణ సూక్తాన్ని అందుకున్నాడు. ఆశ్చర్యం! స్ఫురణకి రాలేదు. ఎన్నిసార్లు జ్ఞాపకం తెచ్చుకోవాలని ప్రయత్నించినా కుదరలేదు. దాని బదులు ఏవేవో సందర్భశుద్ధిలేని మంత్రాలు మనస్సులో మర్మరిస్తున్నవి. విసుగు పుట్టిన బ్రాహ్మణుడు స్వామికి నమస్కరించుకొని సరస్సుకేసి చూడగా... బుర్ర తిరిగిపోయే అత్యాశ్చర్యకరమైన దృశ్యం!

తాను మరణించాడు. బంధువులు దుఃఖితులై తన శవాన్ని దగ్ధం చేస్తున్నారు. ఆ దహనం చేయడం ఎలా ఉంది అంటే సాగరగర్భంలో బడబాగ్ని ఉవ్వెత్తుగా బయటకు వచ్చి సర్వసృష్టినీ దహిస్తున్నదా అన్నంత భయంకరంగా ఉన్నది.

వ్యాకులమైన గాధి బ్రాహ్మణుని మృత ఆత్మ అలా అలా బయలుదేరి వెళుతున్నది. గాధి అంతా గమనిస్తూ ఆసక్తితో ఏం జరుగుతుందో చుద్దామని చూస్తున్నాడు. అలా అలా వెళ్లిన అతని మృత - ఆత్మ ఒక మారుమూల పల్లెలో ఒక చండాలిని గర్భం ప్రవేశించింది. కొంతకాలానికి బాలుడు పుట్టాడు . వాడు అక్కడి ఆచార వ్యవహారాలకు విద్యాసంస్కారాలకు అతీతుడై మహాజ్ఞానియై పెరుగుతున్నాడు. గూడెంలో వాళ్లంతా వీడు పూర్వజన్మలో బ్రాహ్మణుడై వుంటాడు అని అనుకుంటున్నారు.

గాధికేమి తోచలేదు. విచారశీలుడై మననం చేస్తూ చేస్తూ ఒక కొండ గుహలోపల చేరి విశ్రాంతి తీసుకుంటున్న సింహంలాగ నిశ్చల భావాన్ని అవలంభించి జీవించాడు. కేవలం స్వామికి అర్పణగా రోజుకొక్క చారెడు మంచినీరు మాత్రం తీసుకొని మళ్లీ తపస్సు చేశాడు. ఈసారి స్వామి మళ్లీ ప్రత్యక్షమైనాడు. ఆయన్ని కన్నులారా దర్శించిన గాధికి ఒక శరత్కాల సరోవరం సాక్షాత్కరించినట్లయింది. నమస్కరించి 'స్వామీ ఏమిటిదంతా అన్నాడు. 'ఏదంతా ?' - "అదేనేనూ, నేను చూస్తున్నదీ" 'బావుందయ్యా, నువ్వేం చూస్తున్నావో నాకేం తెలుసు. నువ్వే తెలుసుకో అంటూ అంతర్ధానం చేశారు.

గాధి బ్రాహ్మణుడు గమనిస్తున్నాడు. తాను అక్కడ చండాల వాటికలో పెరిగి పెద్దవాడయ్యాడు.సరే పెళ్లి - పిల్లలు - సంసారం కథ జోరుగా దృశ్యాల బారుగా నడచిపోతున్నది. గాధి యొక్క మృత ఆత్మ గమనిస్తూ గమనిస్తూ, విలపిస్తూ, విస్తుపోతూ కొంతకాలం గడిచింది.

ఈసారి గాధి గట్టి నిర్ణయం చేసుకున్నాడు. స్వామిని ఇతోధికమైన ఉగ్రతపస్సుచేత మెప్పించాలి. రప్పించాలి. అన్ని విషయాలూ స్పష్టంగా చెప్పేట్లు ఒప్పించాలి. ఇంకేం ఉగ్ర తపోమార్గాన్ని అవలంభించాడు. మరుక్షణంలో స్వామి ప్రత్యక్షమై 'ఏమీ గాధీ మళ్లీ ఏమైందయ్యా?' అనగా గాధి ప్రసన్నుడై శరణాగతి చెంది కన్నీట స్వామి పాదాలు కడిగి' ఈసారి సరసం వద్దు స్వామీ. అసలుసంగతి స్పష్టంగా చెప్పండి. ఎంతగా అంటే సూర్యకాంతిచేత భూమి వెలిగిపోయినంత స్పష్టంగా నాకు అవగతం కావాలి.'

అలాగా అయితే విను. మళ్లీ మళ్లీ పిలవకు. చెప్పే విషయం అవధరించి ధ్యానించి తరించు. అంటూ ఇలా ప్రవచించాడు.

➢ తరువాయి 27 వ పేజిలో.......

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

**మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శితమాత్మయోగాత్**
**తేజోమయం విశ్వమనంతమాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్(11-47)**

యజ్ఞాలతో, వేదాధ్యయనంతో, దానాలతో, తపస్సుతో నీ రూపాన్ని (కాలరూపాన్ని, కర్మ రూపాన్ని) చూడడం సాధ్యంకాదు. మామూలు ఆలోచనలకు, సగటు మనుషులకు అందనిది గదా 'కర్మ' రూపం. నైపుణ్యానికి రూపం వస్తే అది నేను. కాలానికి రూపం వస్తే అది నేను. ఈ రకమైన స్పృహ వున్న వాళ్లు మాత్రమే నన్ను చూడగలరు'' అన్నాడు.

**న వేదయజ్ఞాధ్యయనైర్న దానైః న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః।**
**ఏవంరూపః శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర॥ (11-48)**

నీవు అంత భ్రాంత చిత్తుడవైనందున ఆ రూపాన్ని మరచిపోయి నీవు కోరిన రూపాణ్ణిచూడు. కలత చెందకుండా ప్రశాంతమైన చిత్తంతో చూడు.

**మా తే వ్యథా మా చ విమూఢభావో దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్।**
**వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం తదేవ మే రూపమిదం ప్రపశ్య ॥ (11-49)**

ఇది కూడా చాలా సహజమైన సన్నివేశమే. మన అమ్మగారో, నాన్నగారో చాలా కోపంతో ఊగిపోతూ కేకలేస్తుంటే, అరుస్తుంటే ''అంత కోపంలో ఎంతో భయంకరంగా ఉన్నావు, దయచేసి కోపం వదిలి, శాంతగా చెప్పు నాన్నా/ అమ్మా'' అంటే వాళ్లు కూడా మళ్లా తమను తాము తమాయించుకొని స్వస్వరంతో, స్వస్వరూపంతో ప్రశాంతంగా మాట్లాడడం మన అందరికీ అనుభవమే. యుద్ధం చేయనంటున్న అర్జునుడితో యుద్ధం చేయించే ప్రాసెస్‌లో (ప్రక్రియలో) ఇదీ ఒక భాగమే. "నీ వెధవ్వేషాలు మాని, నోర్మూసుకొని చెప్పిన పని చెయ్. నేను చెబుతున్నాను కదా, ఆ బాధ్యత నీది. వెంటనే చెయ్'' అని అమ్మో, నాన్నో గదమాయిస్తే "సరే" అంటూ ఆ పని మీద తుర్రుమంటూ వెళ్లడం మన అందరి అనుభవంలోదే. ఆ పని అయిన తర్వాత మరలా అమ్మో/నాన్నో కోపాన్నీ, గదమాయించే కవళికలను వదలిపెట్టి మామూలు మనిషి అవడం కూడా సహజమే. కాబట్టే ''దారిలో పడుతున్న" అర్జునుడు అడిగినట్లే "అలాగే... నీవు కోరిన రూపంలో నన్ను చూడు'' అన్నాడు.

xxxx

ఇదంతా చూస్తున్న సంజయుడు.... దృతరాష్ట్రుడితో జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు వివరించాడు. "ఓ దృతరాష్ట్ర మహారాజా! ఇలా చెప్పిన తర్వాత శ్రీకృష్ణుడు అర్జునునికి - అతను కోరినట్లే - తన విశ్వరూపాన్ని ఉపసంహరించి - ఆ తర్వాత చతుర్భుజరూపాన్ని చూపి - ఆ తర్వాత దాన్ని ఉపసంహరించి - ఆ తర్వాత సర్వసాధారణమైన తన మానవ స్వస్వరూపాన్ని - ద్విభుజ రూపాన్ని చూపించాడు'' అన్నాడు.

**ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా స్వకం రూపం దర్శయామాస భూయః।**
**ఆశ్వాసయామాస చ భీతమేనం భూత్వా పునః సౌమ్యవపుర్మహాత్మా (11-50)**

''విశ్వరూప సందర్శన యోగం''లో ఆధునిక మానవుడు తెలుసుకోవలసినది ఏమిటంటే అవసరానికి అనుగుణంగా అభివృద్ధి చెందడం. మామూలుగా మన "పని" మనం చేస్తాం. అవసరమైతే రెండు చేతులతోనూ చేస్తాం. ఇంకా అవసరమైతే "చతుర్భుజులం" కావాలి. ఇంకా పెద్ద అవసరం వస్తే ''సహస్రాక్ష సహస్ర పాదులం'' కూడా కావాలి. మామూలు రోజుల్లో ఎవరి పని వాళ్లు

చేసుకుంటుంటాం. ఏ విదేశీ దురాక్రమణో జరిగినప్పుడు, శత్రువులు మీద పడినప్పుడు ఏ మిలిటరీ జవానో, ఏ పోలీసో వస్తాడని ఎదురు చూస్తూ ఊరుకోం. మనమే పోలీసులాగా, మిలిటరీ జవానులాగా మారి శత్రువులను ఎదిరిస్తాం. మట్టి కరిపిస్తాం... ఇదీ మన విశ్వరూపం. చైనా దురాక్రమణలో, పాకిస్థాన్ దురాక్రమణలో సరిహద్దు గ్రామాల ప్రజలు ఇలాగే చేశారు. ప్రతి ఇంటి నుండి సైన్యానికి సహాయంగా వెళ్లి సైన్యంతో సమానంగా పోరాటం సాగించారు. పోరాటం పూర్తి అయిన తర్వాత మరలా ఎవరి పనుల్లో వారు రోటీన్‌గా నిమగ్నమైపోయారు.... ఇదీ విశ్వరూపోపశమనం అంటే...

శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని ఉపసంహరించిన తర్వాత అర్జునుడు శాంత చిత్తుడైనాడు ఆ క్షణంలో ఏర్పడిన భయ విహ్వలత క్రమంగా వీడిపోయింది. కృష్ణుడు పూర్వ రూపం ధరించినట్లే అర్జునుడు ప్రశాంత మానసిక స్థాయిని పొంది ఆహ్లాదించాడు. "జనార్ధనా ఇప్పుడు నేను పూర్వ మానసిక స్థితికి వచ్చాను. నీ సుందర మానవ రూపం చూచాను. చాల స్థిమితపడ్డాను" అని అన్నాడు అర్జునుడు.

**దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।**
**ఇదానీమస్మి సంవృత్తస్సచేతాః ప్రకృతిం గతః ॥ (11-51)**

"ఓ అర్జునా 'కర్మ' యొక్క రూపాన్ని ( నా విశ్వరూపాన్ని) చూడడానికి, రూపించిన కాలాన్ని గమనించడానికి దేవతలు కూడా ఎప్పుడూ వేచి ఉంటారు. దుర్లభమైన ఈ రూపాన్ని నీవు చూడగలిగావు" అన్నాడు శ్రీకృష్ణుడు.

**సుదర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ**
**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః ॥ (11-52)**

నీవు చూచిన రూపం మామూలు వేదాధ్యయనం, తపస్సు, ధ్యానం, పూజలు చేయడం వంటి వాటితో సాధ్యంకాదు. అసలు నా రూపాన్ని తెలుసుకోవడానికి ఇవి సాధనాలుకావు.

కేవలం భక్తియుక్తమైన సేవను నాపట్ల ('కర్మ' పటల, 'పని' పట్ల) కలిగివున్న వాడు మాత్రమే నన్ను చూడగలడు, నన్నుఅర్థంచేసుకోగలడు.

**భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప (11-54)**

నా మీద (పని మీద) విశుద్ధమైన ప్రేమ మయమైన సేవలో నిమగ్నుడైనవాడు, మానసిక బలహీనతల నుండి విముక్తుడైనవాడు, నా కొరకే (పనికొరకే) పని చేయువాడు, నన్నే (పనినే) జీవిత పరమార్ధముగా నెంచువాడు నా ద్వారా (పని ద్వారా) శాశ్వితుడవుతాడు.

**మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।**
**నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ (11-55)**

"పని"కి "కర్మ"కు ప్రతీకగా, రూపంగా, శ్రీకృష్ణుణ్ణి చెప్పుకుంటూ, శ్రీకృష్ణ మాధ్యమం ద్వారా కర్మయొక్క విశిష్టతను వివరించుకుంటూ, భగవద్గీతలోని పదకొండవ అధ్యాయమైన విశ్వరూప సందర్శన యోగాన్ని ఇంతటితో సుసంపన్నం చేసుకుంటూ, వచ్చే నెల సంచిక నుండి అర్జునుడి పసిడి పలుకులతో ప్రారంభమయ్యే భక్తియోగాన్ని విపులీకరించుకుందాం.

పాఠకులనుండి వస్తున్న అసంఖ్యాకమైన ఫోన్లు, ఉత్తరాలు ఈ భాష్యకారుడిని (రాధశ్రీని) ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆకతాయిల కాలవాలంగా కనిపించే ఈ కాలంలో, ఈ సమాజంలో, ఈ విశృంఖాలత్వంలో, ఈ విలాయితీ భావ జాలంలో కూడా ఇంకా ఇంతగా గీతను ప్రేమిస్తూ, ఆరాధిస్తూ, నేను క్రొత్త కోణంలో నుండి రాస్తున్న ప్రతి అక్షరాన్నీ శల్యపరీక్ష చేసి మరీ ప్రశంసిస్తున్న చదువరులకు, అసంఖ్యాకమైన చదువరులకు నన్ను దగ్గర చేస్తున్న కాలజ్ఞాన సుధ స్థాపకులు శ్రీశ్రీశ్రీ యోగి అచలానందస్వాములవారికి, ఈ గీతను సాంతంగా, శాంతంగా, సాకల్యంగా పర్యవేక్షిస్తున్న శ్రీశ్రీశ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారికి, అసంఖ్యాకులైన ముముక్షువులకు, భక్తవరులకు, కర్మవీరులకు, ధర్మవీరులకు ఈ భాష్యకారుడు - ఈ రాధశ్రీ - సర్వదా, సర్వధా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాడు.

(వచ్చే నెల సంచిక నుండి భక్తియోగం ప్రారంభం)

# శీలం - జీవితాన్ని రక్షిస్తుంది

.......... శింగల్‌రెడ్డి ఈశ్వరరెడ్డి ..........

శీలం అంటే ప్రవర్తన, నడవడి, అభ్యాసము, అలవాటు అని నిఘంటువు అర్థం. ఈ ప్రవర్తన లేదా నడవడి సక్రమంగా ఉంటే అందరిచే ప్రశంసించబడతారు. స్త్రీపురుషులకు, బాల బాలికలకు మంచి ప్రవర్తన అవసరం. మృదు భాషణం, సత్ప్రవర్తన ఉంటే అందరు హర్షిస్తారు. మన నడవడి సరిగాలేకుంటే దురుసుగా ప్రవర్తిస్తే స్నేహితులు సైతం దూరమవుతారు. అందుకే శీలం అందరికీ అవసరం.

ఈ శీలం విద్యార్థి దశనుండే అలవడాలి.. "శీలేనశోభతే విద్యః" అన్నారు. ఎంత పెద్ద చదువులు చదివినా, ఎన్ని విద్యలు నేర్చినా సత్ప్రవర్తన లేకుంటే అంతావృధ. వినయములేని విద్య అవిద్య అన్నారు. గురువు వద్ద క్రమశిక్షణతో, సత్ప్రవర్తనతో మెలిగి విద్యనభ్యసించాలి. గురువుల యెడల గౌరవ మర్యాదలు కలిగి నడచుకోవాలి.

గురువు నుండి నేర్చుకొన్న విద్యతో అహంకారం పెరిగిన ఇందీవరాక్షుండు గురువుచే శపించబడి రాక్షసుడైపోతాడు. రాక్షసవంశంలో జన్మించిన ప్రహ్లాదుడు గురువు నుండి కాక దైవత్వం ద్వారా వినయ విధేయతతో శ్రీ మహావిష్ణువునే ప్రసన్నం చేసుకున్నాడు. మన భారత, రామాయణ పౌరాణిక, యితిహాసాల గాధలు పరిశీలిస్తే పతివ్రతల శీలమునకు ఎంతటి ప్రాధాన్యత నిచ్చారో మనకు అవగతమౌతుంది. త్రిమూర్తులను పసిపిల్లలను చేసి ఊయలలూపిన సతీఅనసూయ, యముని పాశము నుండి భర్త ప్రాణాలు కాపాడుకున్న సతీసావిత్రి, భర్తకు మరణం రాకుండా సూర్యోదయాన్ని నిలిపిన సతీసుమతి, పాతివ్రత్యా నిరూపణకు అగ్నిలో దూకిన సీత, తులసీ దళంతో శ్రీకృష్ణుని తూచిన రుక్మిణి, ఇలా ఎందరో పడతులు సత్శీలత వలనే అందరితో కీర్తింపబడ్డారు.

"చదువుకున్న ఫలము కుదురైన వినయమ్ము" అన్నారు బ్రహ్మంగారు. అంతేగాక "స్త్రీలలోన గలుగు శీల సంపదలతో సత్యపథములోన జగము నడచు" అన్నాడు. మహనీయులు, మహాత్ములు, అనుభవంతో మనకు చెప్పిన వాక్యాలు ఆకళింపుచేసికొని జీవిస్తే మన జీవితము ధన్యమౌతుంది.

సత్యము, అహింస, ధర్మం అనే సత్ప్రవర్తన కలిగించే వాక్యాల ననుసరించి గాంధీగారు మహాత్ముడుగా కీర్తింపబడ్డారు. దేశ ప్రజలందరిని ఏకతాటిపై నడిపించి స్వరాజ్యం సాధించారు. మహాత్మగాంధీ గారి ఆదర్శం మనందరికీ శిరోధార్యం.

మానవ జీవితాన్ని సక్రమ మార్గములో నడిపి విజయ పథంలో నడిపేది శీలం. జీవితం ఆనందమయం కావాలంటే సత్శీలత అవసరం. 'ధర్మోరక్షతి రక్షితః' అన్నట్లు శీలం మనల్ని రక్షిస్తుంది. శీలం పోతే జీవితంలో అన్నీ పోగొట్టుకున్నట్లే when you lost your character every thing is lost అన్నది ఇంగ్లీషు సామెత.

వ్యాపార రంగంలోగాని, రాజకీయ రంగంలోగాని, క్రీడా రంగంలోగాని సత్శీలత, సత్ప్రవర్తన లేకుండా

విజయం సాధించలేరు. ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించే మహనీయుల జీవితం ఒక సత్ప్రవర్తన గ్రంధం. మదర్ థెరిసా, నోబెల్ గ్రహీత జీవితం వారి త్యాగ నిరతి సమయపాలన, సత్శీలత ప్రేమ, వాత్సల్యాలకు మూల నడవడి. అబ్దుల్ కలాం లాంటి ఉన్నత వ్యక్తుల నుండి మనం నేర్చుకోవలసినది ఎంతోవుంది.

వివేకానందులు ప్రపంచవ్యాప్తంగా యువకులను ఉత్తేజపరచి భావిభారత పౌరులకు సౌశీల్యం వివరించి జాతి ఔన్నత్యాన్ని నిలిపారు. అందరి జీవితాలు విజయవంతం వికాసవంతం కావాలంటే "శీలం" అవసరం. మంచి నడవడి ఉంటే ఇతరులు కూడా మనల్ని గౌరవిస్తారు, అనుసరిస్తారు. ఎదుటి మనిషిని గౌరవించడం, గౌరవింపబడటం, మన నడవడి, శీలాన్ని అనుసరించే ఉంటుంది.

అందుకే శీలం మన జీవితాన్ని రక్షిస్తుంది. □

## పాఠకులకు మనవి

ప్రియ పరిపూర్ణాత్మ బంధువులైన **కాలజ్ఞానసుధ** పాఠకులకు విజ్ఞప్తి. ముద్రణ మరియు పేపరు ధర పెరిగినందువలన **2015 అక్టోబరు** నెల నుండి

**విడి ప్రతి : రు. 10/-**

**సంవత్సర చందా : రు. 100/-**

**లుగా** పెంచడమైనది. కనుక పాఠకులు గమనించ గలరు.

**గమనిక :** పాఠకులకు నెల మొదటి వారములో పత్రిక చేరని యెడల ఫోన్ చేసి తెలుపగలరు.

**సెల్ : 99491 32469**

➢ 23 వ పేజి తరువాయి ......

"సర్వత్ర పరిభ్రమించే ఒక చక్రమున్నది. దానిపేరు మాయ. ఆ మాయాచక్రము యొక్క నాభి స్థానంలో (అంటే మధ్యభాగంలో) చిత్తము ఉంటుంది. ఆ చిత్తమే అనేక భ్రమలకు, భ్రాంతులకు, బంధాలకు, అనుబంధాలకుకారణమవుతుంది. అలాగే మనస్సు అనే మహా మర్కటం ఒకటి ఉన్నది. అది ఎక్కడికి వెళ్లుతుందో అదుపులో ఉంచకపోతే ఎన్ని తిప్పలు పెడుతుందో చెప్పలేము. కాబట్టి ఓ గాధి భూసురా! సాధు సజ్జన సాంగత్య సాదనాది ప్రక్రియల చేత మనస్సునీ చిత్తాన్నీ వశం చేసుకొని ఆత్మయందు లయం చేస్తే మాయ యొక్క విక్షేపాన్ని మానవులు జయించ గలుగుతారు.


**చిత్తాక్రమణ మాత్రాత్తు పరమాదౌషధాదృతే**
**ప్రయత్నేనాపి సంసారమహారోగో నశామ్యతి**

(చిత్తాన్ని జయించడం అనే పరమౌషధం లేకపోతే ఎన్ని ప్రయత్నాలు చేసినా సంసారమనే మహారోగము శాంతించదు)

గాధీ! నీవు విజ్ఞాన పరుడవైనా మాయా తత్త్వాన్ని తెలియగోరావు. అంచేత ఆయా దృశ్యాలు నీకు దర్శింపచేశాను. నీలో బీజప్రాయంగా ఉన్న విభ్రాంతులన్నీ నశించాయి. ఇతోధిక సాధన చేసి తరించు.

కనుక రామచంద్రా! నీవున్నూ ఎట్టి విభ్రాంతులకూ లోనుగాకుండా స్థిర సంకల్పంతో పురోగమించు - అంటూ వసిష్ఠులవారు ముగించారు.

# శ్రీరామ భక్తి



## 6. అగస్త్యమహర్షి శ్రీరామభక్తి

- కీ.శే. డాక్టర్ రోహిణి వెంకట సుందరవరద రాజేశ్వరి

పెరుగుచున్న వింధ్యగిరిని అదుపు చేసిన పరమ తేజస్వి అగస్త్యమహర్షి ఆశ్రమము అతి మనోహరము. అచట యే ఋతువు నందైనను సుందర పుష్పములు, సుస్వాదుఫలములు లభించును. మృగాది పశువులు అచట శాంతిగ సుఖముగ సంచరించుచుండును. పలు రకములైన పక్షులు మధుర స్వరముతో గానము చేయుచుండును. రాక్షసగణములు ఈ ఆశ్రమ సమీపమునకు కూడ రాలేవు. భయముతో దూరముగ పారిపోవును. ఏ దృష్టితో చూచినను ఆపదలేని ఆశ్రమము. అందువలన తపోదనులు, ఋషులు, మునులు, దేవతలు, యక్ష, నాగ, పశుపక్ష్యాదులు కూడ ఇచట జీవనము గడుపుచుందురు. అగస్త్యమహర్షిని ప్రశంసించుచు శ్రీరాముడు లక్ష్మణునితో

**నాత్ర జీవేన్మృషా వాదీ క్రూరోవాయది వా శఠః।**
**నృశంసః పాపవృత్తోవా మునిరేష తథావిధః॥**

(వాల్మీకి రామాయణము)

ఈ ముని ఎంతటి ప్రభావశాలియనిన వీని ఆశ్రమ మందు అసత్యము పలుకువారును క్రూరశఠ, నృశంస, పాపాచారులు జీవితము గడుపలేరు.

ఒక సమయమున క్షీరాబ్ధి సమీపమున బ్రహ్మ, శ్రీరాముని "రావణుని వధించి పృథ్వీభారము తొలగించు" మని ప్రార్థించెను. అప్పటి నుండి అగస్త్య మహర్షి తన ఆశ్రమము నందేయుండి శ్రీరాముని దర్శనార్థము నిరీక్షించుచుండెను. తన శిష్యుడు సుతీక్ష్ణుని గురుదక్షిణగా తనకు శ్రీరామభగవానుని దర్శనము చేయింపుమని కోరుకొనెను. సుతీక్ష్ణుడు శ్రీఅగస్త్యుని చరణములకు ప్రణామములు చేసి శ్రీరామ భగవానుని కొరకు అచటి నుండి వెళ్లెను. అతడు నిరంతర సాధనలో మునిగియుండెను. శ్రీరాముని చరణములపై అతని భక్తి అనుపమైనది. అందుచేత శ్యామసుందరుడు శ్రీసీతాలక్ష్మణ సహితుడై దర్శన మిచ్చెను. ఇతని కోరిక తీరెను. ప్రభుని వెంటబెట్టుకొని తనగురువు శ్రీ అగస్త్య మహర్షి ఆశ్రమమునకు వెళ్ళెను. ఆ సమయమందు అగస్త్యుడు రామ భక్తులతో కలిసి శ్రీరాముని గుణములను గానము చేయుచుండెను.

**దండవత్ ప్రణి పత్యాహ వినయావనతః సుధీః।**
**రామో దాశరథిర్బ్రహ్మన్ సీతాయా లక్ష్మణేన చ।**
**ఆగతో దర్శనార్థంతే బహిస్తిష్ఠతి సాంజలిః॥**

సుతీక్ష్ణుడు వినయ పూర్వకముగ ప్రణామములు చేసి "బ్రహ్మర్షీ! దశరథ కుమారుడు శ్రీరాముడు సీతాలక్ష్మణులతో కలసి మిమ్ము దర్శించుటకు వచ్చియున్నాడు. అంజలి ఘటించి ఆశ్రమము వెలుపల నిలువబడియున్నాడు" అనెను. ఈ మాటలు వినిన వెంటనే అగస్త్య మహర్షి తన పరమారాధ్యుని దర్శించుటకు పరుగిడెను.

**రామోఽపిముని మాయాన్తం దృష్ట్వా హర్ష సమాకులః।**
**సీతయాలక్ష్మణే నాపి దండవత్ పతితో భువి॥**
**ద్రుతము త్థాప్యమునిరాడ్ రామ మాలింగ్య భక్తితః।**
**తద్గత్ర స్పర్శ జాహ్లాద స్రవన్నేత్ర జలాకులః॥**

మునీశ్వరుడు వచ్చుట గాంచిన శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సహితుడై పృథ్విపై దండ ప్రణామములు చేసెను. ముని వెనువెంటనే రాముని లేపి ప్రేమ

పూర్వకముగ హృదయమునకు చేర్చుకొనెను. శ్రీరాముని శరీర స్పర్శపొందిన ముని నేత్రములు ఆనంద జలపూరితములయ్యెను.

తరువాత అగస్త్యమహర్షి వాత్సల్యముతో కుశల ప్రశ్నలడిగెను. శ్రీరాముని అమృత వాక్కులతో మహర్షి రోమరోమములు పులకించెను. తన ప్రాణధారులగు శ్రీసీతారాములను లక్ష్మణుని సుందర ఆసనముపై కూర్చుండబెట్టి ప్రేమతో పూజించెను. వనములోని సుందర సుస్వాదు ఫలములతో వారిని సంతుష్టపరచి "నేడు నా వంటి భాగ్యశాలి ఎందున లేడు. యోగుల మనస్సులను రంజింపజేయుడు, భక్తులకు ఆనందమొసగువాడు అయినట్టి శ్రీరాముని, విదేహ తనయ సీతను, లక్ష్మణుని నా ఆశ్రమమందు ప్రత్యక్షముగ చూచుచున్నాను. దయామయా! మీ దయ అనంతము" అనుచు ఈ విధముగ స్తుతించెను.

**దీర్ఘకాలం మయాతప్త మనన్య మతినా తపః।**
**తస్యేహ తపసో రామఫలం తన య దర్శనమ్॥**
**సదామే సీతయా సార్థం హృదయే వనరాఘవ।**
**గచ్ఛతస్తిష్ఠతో వాపిస్మృతిః స్యాన్మే సదాత్వయి ॥**

(ఆనందరామాయణము)

"ప్రభూ! నేను దీర్ఘకాలము నుండి అనన్య భావముతో తపస్సు చేయుచుంటిని. రామా! నేడు మిమ్ములను ప్రత్యక్షముగ పూజించితిని. ఇదే ఆ తపస్సు ఫలము. రాఘవా! సీతాసహితులై మీరు సర్వదా నా హృదయ మందే నివసింపుడు. సర్వకాల సర్వావస్థలయందు మిమ్ము స్మరించునట్లు చేయుడు.

ఈ విధముగ స్తుతించి అగస్త్య మహర్షి (రాక్షస సంహారము కొరకు) పూర్వకాలమున శ్రీరాముని కొరకు ఇంద్రుడిచ్చిన ధనస్సు, బాణములను ఎప్పుడును ఖాళీకాక నిండియుండు రెండు అమ్ముల పొదులను, రత్న ఖచిత ఖడ్గమును ఇచ్చి ముని జనవందితుడగు శ్రీరామునితో...

**అనేన దనుషా రామ హత్వా సంఖ్యే మహాసురాన్।**
**అజహార శ్రియం దీప్తం పురా విష్ణుర్ది వౌకసామ్॥**
**తద్దమ స్తౌచ తూణీచ శరం ఖడ్గం చ మానద।**
**జయాయ ప్రతి గృహ్ణీష్వ వజ్రం వజ్రదరోయథా॥**

(వాల్మీకి రామాయణము)

"శ్రీరామా! పూర్వ కాలమందు విష్ణు భగవానుడు ఈ ధనస్సుతోనే యుద్ధమందు గొప్ప గొప్ప రాక్షసులను సంహరించి దేవతలకు అధికారలక్ష్మిని తిరిగి చేకూర్చెను. మీరు ఈ ధనస్సును, ఈ రెండు తూణీరములను, ఈ బాణములను రాక్షసులపై విజయము పొందుటకు వజ్రధారి ఇంద్రుడు వజ్రమును గ్రహించినట్లు గ్రహింపుము" అనెను.

సర్వ సమర్థుడు సర్వేశ్వరుడగు శ్రీరాముడు ఆ శ్రేష్ఠాయుధములను గ్రహించి వినయముగ "మహామునీ! మీరు నా యందు దయవుంచి జలము గ్రహించి వినయముగ పుష్పఫలాదులు చక్కగ నుండునట్టి స్థానమును చెప్పితిరి. అచట కుటీరము నిర్మించుకొని సుఖముగ కాలము గడుపుదును" అని ప్రార్థించెను.

తన పరమారాధ్యుడు అఖిల సృష్టికి స్వామి, జగదాధారుడగు శ్రీరాముని ముఖారవిందము నుండి వెలువడిన వచనములను వినిన అగస్త్యుని నేత్రములు కన్నీటితో నిండి ప్రవహించినవి. ఆయన రాముని సౌందర్యశీల వినయాది గుణములకు అతిముగ్ధుడయ్యెను.

పద్మపత్రాక్ష శ్రీరాముడు అగస్త్య మహర్షి చరణములకు ప్రణామము లర్పించి అచటి నుండి దండక వనమునకు ప్రయాణమై వెళ్ళెను.

అగస్త్య మహర్షి ధన్యుడు. వాని రామ పద ప్రీతి ధన్యము.

# రఘువంశం



మహాకవి కాళిదాసు
కృతికి భావానువాదం:
డా॥ సముద్రాల లక్ష్మణయ్య,
తిరుపతి

## ఇందుమతీ స్వయంవరం

అజుడు స్వయంవర మండపానికి వచ్చేసరకి భూమండలంలోని రాజులందరూ అక్కడ చేరివున్నారు. అందంగా అలంకరించుకొని సమస్త రాజోపచారా లందుకొంటూ విహాయసంలో విమానాలపై సంచరించే దేవతలలాగా మంచెలమీది గద్దెలపై కూర్చొనివున్న ఆ భూపాలకుల నందరినీ అతడు చూచాడు.

రతీదేవి మొఱ ఆలకించి శివుడు మళ్ళీ మన్మథుడికి శరీరాన్ని ప్రసాదించాడా అన్నట్లు ప్రకాశిస్తున్న అజమహారాజును అవలోకించగానే ఆ రాకుమారులు ఇందుమతిపై ఆశ వదలుకొన్నారు. రాళ్లమీదుగా గిరిశిఖరమెక్కే సింగపు కొదమలాగా అజుడు మెట్లమీదుగా భోజరాజు చూపిన మంచె నధిష్ఠించాడు. అక్కడ రంగురంగుల కంబళ్ళు పఱచివున్న రత్నఖచిత సింహాసనంపై కూర్చున్నప్పుడు అతడు నెమలి వీపుమీద నెలకొన్న కుమారస్వామిలాగా వెలిగాడు.

బారులు తీరివున్న భూపాల పుత్రులలో మేఘపంక్తులలోని మెఱుపుతీవలాగా వేయివిధాలుగా సంక్రమించిన కాంతి కళ్లకు మిరుమిట్లు గొలుపుతూ చూడ శక్యంగాని విధంగా ప్రకాశించింది. ఉజ్జ్వలంగా అలంకరించుకొని వేలిగద్దెలపై ఆసీనులైన నృపనందనుల నడుమ కల్పవృక్షాలమధ్య పారిజాతం మాదిరి అజుడొక్కడే మహాతేజస్సుతో వెలిగిపోయాడు. పూలచెట్లను వదలి తుమ్మెదలు మదించిన వనగజంమీద వాలినట్లే జనుల చూపులన్నీ ఆ రాజపుత్రులను వదలి అతనిపై వాలాయి.

అప్పుడు స్తుతిపాఠకులు సూర్యచంద్ర వంశజులైన మహీపతుల నందరినీ స్తుతించారు. అగరుధూపం అంతటా వ్యాపించి చివరికి పతాకల మీదికిగూడా ఎగబ్రాకింది. శంఖనాదాలూ, మంగళవాద్యాల మ్రోతలూ మిన్నుముట్టాయి. ఆ ధ్వని విన్న నగరోద్యానంలోని నెమళ్లు ఉఱుములన్న భ్రమతో నాట్యమాడసాగాయి.

ఇంతలో ఇందుమతి పెండ్లికూతురు వేషంతో పల్లకినెక్కి వచ్చి పరిజనులు వెంటరాగా మంచెల మధ్యనున్న రాజవీథిని ప్రవేశించింది.

బ్రహ్మసృష్టిలో అపూర్వమైన కనులపండువు గావిస్తున్న ఆ కన్యమీదనే రాజులందరి మనసులూ వ్రాలాయి. వాళ్ల శరీరాలు మాత్రమే ఆసనాలపై వుండిపోయాయి. ఇందుమతిపై అభిలాషగల ఆ రాజపుత్రులకు చెట్లకు చివుళ్ళు అంకురించినట్లు ప్రణయదూతి కలను బోలిన పెక్కు శృంగార చేష్టలు కలిగాయి.

ఒక భూపాలుడు లీలాకమలనాళం చేతులతో పట్టుకొని ఆ తమ్మిరేకులు తుమ్మెదలకు తగిలేటట్లుగానూ, పుప్పొడి గుడికట్టేటట్లుగానూ గిరగిర త్రిప్పాడు. మరొక విలాసశాలి భుజంపై నుండి జారి రత్నాలు చెక్కిన భుజకీర్తి కొనకు తగులుకొన్న హారాన్ని ముఖం అడ్డంగా త్రిప్పుతూ సవరించుకొన్నాడు. ఇంకొకడు చూపు కాస్త్రా క్రిందికి వాల్చి నఖకాంతులు ప్రసరిస్తుండగా వంచిన కాలి కొనవ్రేళ్ళతో

బంగారుపీఠాన్ని గీరాడు. మరొకడు గద్దెపై ఒక ప్రక్క ఎడమ భుజంపూనుకొని ఎగుభుజం కలవాడై వెన్నుపై కంఠ హారం జీరాడుతూ వుండగా ప్రక్కనే వున్న మిత్రుడితో ముచ్చట లాడసాగాడు. మరొక యువకుడు విలాసినులు చెవికమ్మగా దరించే తెల్లని మొగలిరేకును కాంతానితంబాలపై అలవాటుపడ్డ తన కొనగోళ్లతో చీల్చాడు. మరొకడు ధ్వజరేఖలు గల్గి నూరురేకుల తామరలాగా ఎఱ్ఱనైన అరచేతితో రత్నపుటుంగరాల కాంతి ప్రసరిస్తుండగా పాచికలను విలాసంగా ఎత్తివేశాడు.

ఇంకొకడు తన తలమీది రత్నకిరీటం సరిగానే వున్నా జారిపోయినదాన్ని నవరించుకొన్నట్లుగా మణికాంతులు వ్రేళ్ల మధ్య ప్రసరిస్తుండగా చేతితో సవరించుకొన్నాడు.

పిమ్మట ఆ రాజుల చరిత్రలూ, వంశక్రమమూ తెలుసుకొన్నదీ, మాట నేర్పరీ అయిన సునంద అనే ద్వారపాలిక ఇందుమతిని మొదటమగధరాజు వద్దకు తీసుకువెళ్ళి మగవానిలా గంభీరంగా ఇలా చెప్పింది.

''ఈ రాజు శరణు జొచ్చిన వాల్లను కాపాడటంలో నిపుణుడు, మహా గంభీరస్వభావుడు, మగధదేశానికి అధిపతి, ప్రజలను రంజింప జేసి కీర్తిమంతుడైనాడు, శత్రువులను మాడ్చి వేయడంవల్ల 'పరంతపు'డనే ఇతని పేరు సార్థకమయింది.

లోకంలో ఎంతమంది రాజులుంటేనేమి ? ఈయన ఒక్కడివల్లనే భూమికి 'రాజన్వతి' (మంచిరాజు ఏలుబడిలో నున్నది) అనే పేరు వచ్చింది. వేలకొలది నక్షత్ర తారాగ్రహాలున్నా చంద్రుడొక్కడివల్లనే కదా రాత్రి 'జ్యోతిష్మతి' అవుతున్నది! ఈ మహారాజు ఎప్పుడూ యజ్ఞాలు చేస్తూ దేవేంద్రుణ్ణి ఆహ్వానిస్తూ వుంటాడు. అందువల్లస్వర్గలోకంలోని శచీదేవికి చిరకాలం భర్తృవిరహబాధ తప్పడంలేదు. వరణీయుడైన ఈనరవరుణ్ణి నీవు వరించావంటే పాటలీపురంలోని రాజభవనాల కిటికీల నుండి అంగనామణు లందరూ నిన్ను కన్నులపండువుగా కాంచి ఆనందిస్తారు.''

సునంద ఇలా చెప్పేసరికి చేతిలోని పూలమాల కొంచెం జారుతూ వుండగా ఇందుమతి ఆ రాజుకు మౌనంగా వట్టి నమస్కారం చేసి అతణ్ణి పరిహరించింది. ఆమె అభిప్రాయం గ్రహించిన సునంద గాలికి రేగిన అలల వరుస మానస సరస్సులోని రాజహంస మరొక పద్మం వద్దకు చేర్చినట్లు ఇంకొక రాజువద్దకు తీసుకుపోయింది.

ఆమె మళ్లీ ఇందుమతితో ఇలా అన్నది -

''ఈయన అంగదేశపురాజు. ఇంద్రుడికి సహాయపడటానికి స్వర్గలోకానికి వెళ్లినప్పుడు అక్కడి అప్సరసలు ఈయన జవ్వనపు సొంపు చూచి మరులు గొన్నారు. గజశాస్త్ర కారులయిన సురమహర్షులే ఇతని యేనుగులకు శిక్షణ యిచ్చేవారు. ఇలా ఈమహారాజు భూలోకంలో వున్నా ఇంద్రైశ్వర్యం అనుభవిస్తున్నాడు. విగతభర్తృక లయిన ఇతని శత్రుభార్యలు జాలువార్చిన ముత్యాలవంటి పెద్దపెద్ద కన్నీటిబొట్లు వాళ్ళ శిరోజాలపై దారాలులేని హారాలా అన్నట్లు భాసించాయి. సహజంగా ఒకచోట కలిసి ఉండని లక్ష్మీసరస్వతు లిద్దరూ ఈ అంగరాజువద్ద విరోధం మాని ఏకంగా వున్నారు. కల్యాణీ! అందంతో అటు లక్ష్మికీ, సత్యవచనంతో ఇటు శారదకూ తగిన నెచ్చెలివైన నీవే ఈ నృపుని వద్ద మూడవ దానివిగా ఉండటానికి యోగ్యురాలవు.''

అంతట ఇందుమతి అంగరాజునుండి చూపు మరల్చి సునందను ముందుకు సాగమని హెచ్చరించింది. అతడు వరణీయుడు కాకపోలేదు.

ఆమె వివేకదృష్టి లేనిదీ కాదు. అయినా లోకుల అభిరుచులు భిన్నాభిన్నంగా వుంటాయి కదా!

పిమ్మట సునంద శత్రువులకు సహింప రానివాడూ, మిక్కిలి దర్శనీయుడూ అయిన మరొక రాజును అప్పడే ఉదయిస్తున్న చంద్రునిలా ఇందుమతికి చూపుతూ ఈ విధంగా చెప్పింది-

"నిడుదలైన చేతులూ, వెడదఱొమ్మూ, సన్నపాటి గుండ్రని నడుమూ కల యీతడు అవంతి దేశానికి భర్త. విశ్వకర్మచే సానబెట్టబడిన సూర్యునిలా ఇతడు ప్రకాశిస్తున్నాడు. సమగ్రశక్తి సంపన్నుడైన ఈనృపాలుడు జైత్రయాత్రలు చేసేటప్పుడు సేనకు ముందు నడిచే గుర్రాలు రేపిన ధూళి శత్రురాజుల సిగలోని మాణిక్యాల వెలుగును అస్తమింపజేస్తుంది.

ఈ అవంతిదేశాధీశుడు మహాకాళక్షేత్రంలో నివసించే చంద్రమౌళికి సమీపంలోనే వున్నాడు. కనుక కృష్ణపక్షంలో గూడా ఇతడు కాంతాసమేతుడై వెన్నెలరేలను అనుభవిస్తూ వుంటాడు. సుందరీ! యువకుడైన ఈ రాజుతో గూడి శిప్రానది అలలమీది గాలికి కదిలే ఉద్యానవన శ్రేణులలో విహరించాలని అభిలషిస్తున్నావా ?"

తామరలను వికసింప జేసేవాడూ, బురదను శుష్కింపజేసేవాడూ అయిన సూర్యునిపై తెల్లగలువ తీగకు అభిలాష కలుగనట్లే మిత్రరంజకుడూ, శత్రుభంజకుడూ అయిన అవంతిరాజుపై ఆ కోమలాంగికి మనసుపోలేదు".

కమలోదరకాంతివంటి కాంతిగలదీ, రూపశీలాది గుణసంపన్నురాలూ, విధాతృని సుందరసృష్టీ అయిన ఆ సుదతీమణిని అనూపరాజు ముందట నిలిపి సునంద ఇలా అన్నది -

"యుద్ధంలో వేయి చేతులతో విజృంభించేవాడూ, పదునెనిమిది దీవులలో యాగాలు చేసినవాడూ, సకల ప్రాణులను రంజిపజేయడంవల్లనే ఇతరుల కన్వయించని రాజశబ్దం పొందినవాడూ, బ్రహ్మవిద్యా సంపన్నుడూ అయిన కార్తవీర్యుడు అనే భూపాలుడు ఉండేవాడు గదా! ప్రజల్లో ఎవరైనా తప్పుచేయాలి అని అనుకొంటే చాలు. వెంటనే ఆ మహీపతి వాళ్ల కళ్లెదుట ధనుర్ధారియై సాక్షాత్కరించి వారి తలంపులను రూపుమాపేవాడు. ఇంద్రవిజేత అయిన రావణాసురుణ్ణి ఆ కార్తవీర్యుడు అల్లెత్రాటితో పెడరెక్కలు విరిచికట్టి చెరసాలలో పడవేశాడు. పదితలలతో బుసకొడుతూ లంకేశ్వరుడు ఆ రాజుకు అనుగ్రహం కలిగేటంతవరకూ అక్కడే పడివుండినాడు.

ఈ రాజు ఆ కార్తవీర్యార్జునుని వంశంలో పుట్టాడు. ఈయనపేరు ప్రతీపుడు. శాస్త్రవేత్తలయిన పెద్దలను ఇతడు సేవిస్తూ వుంటాడు. ఏ విధమైన దుర్వ్యసనాలూ ఇతనికి లేవు. అందువల్ల సిరి ఇతణ్ణి ఎప్పుడూ ఎడబాయక సేవిస్తూ 'సహజచపల' అనే అపకీర్తిని పోగొట్టుకొన్నది. యుద్ధంలో అగ్నిదేవుడు ఈ ప్రతీప మహారాజుకు తోడ్పడి విరోధులను దహించివేస్తాడు. అంచేత వాడియైన పరశురాముని కుఠారధారను ఇతడు కలువరేకులా పేలవమైనదిగా భావిస్తాడు. మాహిష్మతీనగరం ఈ రాజశేఖరునికి రాజధాని. ఆ పురలక్ష్మియొక్క ప్రాకారమనే నితంబానికి ఒడ్డాణంలా రేవానది చెంతనే ప్రవహిస్తూ వుంటుంది. అక్కడి మేడల గవాక్షాల నుండి ఆ నదీప్రవాహాన్ని చూడాలని నీకు కోరిక వుంటే ఆజానుబాహుడైన ఈ భూవల్లభుని వరించు."

శరదృతువులో మేఘావరణం తొలగిన పూర్ణచంద్రుడు తామరతీగకు నచ్చని విధంగానే ఎంతో అందగాడైనా ఆనరపాలుడు ఇందుమతికి నచ్చలేదు.

. (సశేషం)

# ద్రౌపది సహృదయత అనిర్వచనీయం

.... శ్రీతి రావూరి ఇందుమతి, యం.ఏ., తెలుగు పండిట్, నరసరావుపేట, సెల్: 9533721776

శ్రీకృష్ణావతారము వలన భారత భాగవతములకు గల అవినాభావ సంబంధము సుస్పష్టమౌతుంది. ఇందు ద్రౌపది మాతృహృదయము, ద్రౌపది యొక్క సహృదయత తెలియపరుస్తున్నది. ఉపపాండవులను తాము నిర్మించుకున్న శిబిరములో నిదురింపజేసినది. కౌరవపాండవుల మధ్య భయంకర సంగ్రామం జరుగుతోంది. ద్రౌపది తన భర్తల జయాపజయాలపై ఆలోచిన్నా తిన్నగా నిద్రాదేవి ఒడిలోనికి ఒదిగిపోయింది. శిబిరములో పాండవులెవరూ లేరు. ఒంటరిగా నిద్రస్తున్న ద్రౌపదినీ, ఉపపాండవులను చూసిన అశ్వత్థామ తన వెంట తెచ్చుకున్న పదునైన తళతళ మెరిసే కృపాణముచే ఉపపాండవులను నరికేశాడు. తనను ఎవరైనా గమనిస్తారేమో ననుకుంటూ గబగబా అడుగులు వేస్తూ వెళుతున్నాడు. అంతలో యుద్ధం ముగించుకుని వస్తున్న ఫల్గుణుని కంటపడ్డాడు. అర్జునుడు బాలఘాతియగు అశ్వత్థామను బంధించి తెచ్చి ద్రౌపది ముందు పడవేశాడు. ఆ దుర్దశలోనున్న అశ్వత్థామను చూడగానే ఒకింత జాలికలిగినది. కోపం రాకపోగా జాలితో స్వాంతన వాక్యాలు పలుకుతుంది. అసలెందుకు చేశావీ పని అని అశ్వత్థామను పలు మార్లు అడుగుతుంది. ఆమె మాతృహృదయంతో సహృదయముతో అశ్వత్థామను మనసు నొప్పించక ఓ తల్లిలా హితవు పలికింది. పరగన్ మా మగవారలందరును మున్ బాణ ప్రయోగోప సమరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యునిచే నభ్యసించిరి పుత్రాకృతినున్న ద్రోణుడవు, నీ చిత్తంబులో లేశముం గరుణా సంగము లేక శిష్య సుతులన్ ఖండింపఁగా బాడియే!

నాయనా! నా భర్తలు ఐదుగురు మీ తండ్రిగారి వద్ద శస్త్రాస్త్ర విద్యలన్నియు నేర్చుకున్నారు గదా! పుత్రాకృతినున్న ద్రోణుడవుగదా! నీ చిత్తములో లేశమైనా కరుణ లేక శిష్య సుతులను చంపడానికి నీ మనసెట్లా ఒప్పిందయ్యా? నీ కిది న్యాయమేనా? అంటూ....

**ఉద్రేకంబునరారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం**
**చిద్ద్రోహంబును నీకు జేయరు బలోత్సేకంబుతోఁజీఁకటిన్**
భద్రాకారులఁ బిన్నపాపల రణపౌఢ క్రియాహీనులన్
నిద్రానక్తుల సంహరింపన కటా! నీ

చేతులెట్లాడెనో?

ఉద్రేకముతో రాలేరు, ఆయుధాలు ధరించలేము యుద్ధభూమియందు అసలే లేరు, కించిద్ద్రోహమును జేయ భద్రాకారులను, నిద్రాసకులను, తన పిన్న పాపలను చంపటానికి నీచేతు లెట్లాడెనో గదా అంటుంది.

చిన్నపాపలను చంపిన గురుపుత్రుని చూచి "అక్షీణతనూజ శోక వివశీకృత నైవిలపించు భంగి నీ ద్రౌణిందెరల్చి తెచ్చుటకు ద్రోణకుటుంబిని దైన్యము నొందుతు నెంతపొక్కునో ?" అని జాలి చూపించింది. పైగా నీ తల్లి తండ్రితో సహగమనం చేయక నీ పై ఆశలు పెంచుకుని బ్రతుకుతున్నది. అలాంటి ఆమెకు పుత్ర శోకం కలిగిస్తే మాకు న్యాయమనిపించదు. నా భర్తలు తల్చుకుంటే నిన్ను చంపటానికి ఒక్క ఫల్గుణుడు చాలు. కానీ నీవు బ్రహ్మణుడువైనావు.

**భూసురుఁడవు బుద్ధిదయా**
**భాసురుడవు శుద్ధవీరభటసందోహా**

**గ్రే సరుడవు శిశుమారణ**
**మాసుర కృత్యంబు ధర్మమగునే తండ్రీ!**

అని పలు విధాల ద్రౌపది అశ్వత్థామకు హితవచనంబులు చెప్పింది. అని యిట్లు ధర్మంబును, సకరుణంబు, శ్లాఘంబును, నిర్వ్యళీకంబును నవుంజనవుగా జెప్ప ద్రౌపది పల్కులకు ధర్మనందనుడు సంతసిల్లె నకుల సహదేవ సాత్యకీ కృష్ణ ధనుంజయులు సమ్మతించిరి. సమ్మతింపక భీముండిట్లనియె.

**కొడుకులఁ బట్టి చంపెనని కోపము నొందదు బాలఘాతకున్**
**విడువు మటంచు జెప్పెడిని వెఱ్ఱిది ద్రౌపది, వీడు విప్రుడే?**
**విడువఁగనేల? చంపుఁడిటు వీనిని మీరలు సంపరేనినా**
**పిడికిటి పోటునన్ శిరము భిన్నము సేసిదఁ జూడు డిందఱన్.**

నా ఒక పిడికిటిపోటుతో వీడి శిరము భిన్నము చేస్తాను అంటూ భీముడు అశ్వత్థామపైకి ఉరికాడు. అంత నశ్వత్థామకు ద్రౌపది నడ్డంవచ్చింది. అంతహరి చతుర్భుజుండై రండు చేతుల భీము నివారించుచు కడమ రెంటను ద్రుపదపుత్రికను జూచుచు నిట్లనియె.

**అవ్యడుగాడు వీడు శిశుహంత దురాత్మకుఁడా తతాయి హం**
**తవ్యుడు బ్రహ్మబంధుఁడగుఁదప్పదునిక్కము బ్రాహ్మణోన హ**
న్తవ్యయటంచు వేదము శ్రుతంబగుఁగావున ధర్మదృష్టి, గర్తవ్యము వీనిఁగాచుట యథాస్థితిఁ జూడుము బాండవోత్తామా!

వీడు క్షమించదగిన వాడుగాదు, దురాత్మకుడు, ఆకతాయి, హంతకుడూ, అయినా వీడు బ్రాహ్మణుడు, బ్రహ్మబందువగుడు, బ్రాహ్మణులను చంపితే పాపాలకు ఒడిగట్టినట్లాతుందని వేదాలు చెప్తున్నాయి. కాబట్టి వీనిని చంపక తగిన ప్రాయశ్చిత్తము చేసి పంపమని నారాయణుడు ఆనతిచ్చాయి. అర్జునుడు అశ్వత్థామ శిరోజముల్ తరగి తగిన శాస్తి చేసివదలిపెట్టాడు. చివరకు అశ్వత్థామ తాను చేసిన బాలవధకు లజ్జ చెంది తలవంచుకుని పాండవులు తనను మన్నించి నందుకు సంతసిస్తూ తల్లిలాంటి ద్రౌపదికి పుత్రశోకం కల్గించినందుకు పాశ్చాతాపము చెందుతాడు. కృపి కూడా తన కువూరుడు ప్రాణములతో ఉన్నందుకు ఆ నారాయణుడి దయే ద్రౌపది రూపంలో రక్షించిందని భావించింది.

మరో సందర్భములో సత్యాద్రౌపది సంవాదంలో సత్యభామకు ద్రౌపది పాతివ్రత్యధర్మాలను నేర్పుతుంది. ఈ సందర్భములో ద్రౌపది యొక్క సౌశీల్యము, సహృదయత, సహనము, కరుణ శాంత స్వభావములు తెలియజేస్తున్నాయి.


అశ్వత్థామలాంటి అసురులకు ద్రౌపది యొక్క పల్కులు కనువిప్పు కల్గిస్తాయి.

నేటి ఆధునిక కాలంలో సహనం, సహృదయత మొదలైన గుణాలు మృగ్యమైపోతున్నాయి. ఒకే కుటుంబంలో ఉంటూ కుడా నిరంతరం కలహించుకుంటూనే ఉన్నారు. సహజీవనం కరువైపోతోంది. సంస్కృతీ సాంప్రదాయాలు నాగరిక మోజులో పడి మరచిపోతున్నారు.

ప్రతి ఒక స్త్రీ పురుషులు మంచి గుణాలను అలవరచుకుంటే ఆకుటుంబము సుధాంబు రాశిలో ఓలలాడుతుంది.

ద్రౌపది కారణ జన్మురాలు. మహాపతివ్రత. వరమున బుట్టిన మహాసాధ్వి. అలాంటి మహానుభావురాలిని, భారత భాగవతములను రోజులో ఒకమారైనా పఠించుదాం.

వేదవ్యాస భాగవతము, పోతన భాగవతము ఇంకా ఆధునిక కవులు వ్రాసినవి ఉండగా మరల నిదేమి ? రాసినదే వ్రాయటమా అన్న సందేహం కల్గవచ్చు. కానీ మనం రోజూ తిన్నఅన్నవేతింటున్నా విసుగు అన్పించదు. ఇంకా తినాలన్పిస్తుంది. అలాంటి ప్రయత్నముతో నేను నాదైన శైలిలో రాస్తున్నాను. క్షంతవ్యురాలను. దయచేసి అచ్చునకు ఆమోదిస్తారని ఆశిస్తున్నా. మీలాంటి పెద్దల ప్రోత్సాహంతో యింకా వ్రాయగలదాన. తప్పులున్న చోక్షంతవ్యురాలను. □

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## శ్రీకాకుళం ( కృష్ణాజిల్లా - ఆంధ్రప్రదేశ్)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

శ్రీకాకుళం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలో ఘంటశాల మండలంలో మచిలీపట్టణానికి 36 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ ఆంధ్ర మహావిష్ణువు ఆలయం ఉంది.

108 దివ్య తిరుపతులలో శ్రీకాకుళం 57వది.

**పురాణ ప్రసిద్ధి**

బ్రహ్మాండపురాణం, నారదసంహిత, స్కాంద, పద్మపురాణాలలో ఈ ఆలయం గురించిన వివరాలు ఉన్నాయి.

పూర్వం ఓసారి కృష్ణానది నారాయణుడి కోసం ఘోరమైన తపస్సు చేయగా నారాయణుడు ప్రత్యక్షమవ్వగా "నీవు నా తీరం వెంబడే ఉండాలని మీ సేవా భాగ్యం కలిగించా"లని వరమడిగింది. అందుకు స్వామి బదులిస్తూ "బ్రహ్మ తపమాచరించి నన్ను భూలోకంలో నివసింపుడని కోరుతాడని అప్పుడు నీ కోర్కె తీర్చగల"నని చెబుతాడు.

ఆ తరువాత కలియుగంలో నానాటికీ పెరిగిపోతున్న పాపాన్ని నివారించే ఉద్దేశంతో బ్రహ్మదేవుడు కృష్ణాతీరాన శ్రీమహావిష్ణువు గూర్చి తపస్సు చేయగా విష్ణువు అతని భక్తికి మెచ్చి ప్రత్యక్షమై "ప్రజాపతీ! నీ కోర్కె ఎట్టి దైననూ నెరవేర్చెదను కోరుకొమ్మ"నెను.

బ్రహ్మదేవుడు "దేవా! నేను తపస్సు చేసిన ఈ చోట నిన్ను ప్రతిష్ఠించి పూజించుటకు నాకు అనుమతించి ఇక నుండి భూలోక వాసులకు మీ దర్శన మాత్రమున పాపపరిహారమగునట్లు వరమిమ్మని" ప్రార్థించెను.

శ్రీహరి అందుకు సమ్మతించగా బ్రహ్మదేవుడాచోట విష్ణువును ప్రతిష్ఠించి పూజించెను.

బ్రహ్మదేవుడు ఈ ప్రాంతంలో తపస్సు చేయడంవల్ల ఆయన పేరుమీద ఈ ప్రాంతానికి శ్రీకాకుళం అనే పేరు ఏర్పడినట్లు స్థలపురాణం ద్వార తెలియుచున్నది. "క" అనగా బ్రహ్మ. "ఆకులం" అనగా స్థానం అని అర్థం. బ్రహ్మకు స్థానం కావడం వలన ఈ ప్రాంతానికి "కాకులం" అనే పేరు ఏర్పడింది. దానికి "శ్రీ" అని చేరి "శ్రీకాకులం" అయ్యెను. అదే కాలక్రమంగా 'శ్రీకాకుళం'గా మార్పు చెందినట్లుగా తెలియుచున్నది.

శ్రీకాకుళ మహావిష్ణువు విగ్రహాన్ని భృగువు, పులస్త్యుడు, పులాహుడు, అంగరీసుడు, అత్రి, క్రతువు, దశీడు, వశిష్టుడు, మరీచి అనే నవబ్రహ్మలు ప్రతిష్ఠించి తపస్సు చేశారని విష్ణుమూర్తి వారికి ప్రత్యక్షమై తాను ఆంధ్ర మహావిష్ణువు పేరున ఈ క్షేత్రంలో స్థిర నివాసం ఉండి ఆంధ్రులకు రక్షణ ఇస్తానని చెప్పాడని చెబుతారు.

**చరిత్రాధారాలు**

ఇక్కడ ఆలయంలోని స్తంభాలపై తెలుగు భాషలో వ్రాసిన శాసనాలు తెలుగు భాషాభివృద్ధికి పరిణామంగా భావించవచ్చును.

ఈ శ్రీకాకుళాన్ని రాజధానిగా చేసుకొని క్రీ.పూ. 2వ శతాబ్దంలో శాతవాహనులు ఆంధ్రదేశాన్ని పరిపాలించారు. వీరు నాలుగున్నర శతాబ్దాలు ఆంధ్రదేశాన్ని పాలించారు. శాతవాహన శకం వీరి

పేరుమీదనే ప్రారంభమయింది. ఈ వంశీయుల మూలపురుషుడు శాతవాహనుడు. ఈ శాతవాహనుని గురించి ఓ కథ ప్రచారంలో ఉంది. పూర్వం దీపకర్ణి అనే రాజు దక్షిణా పథాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతడు ఓసారి వేటకోసం అడవికి వెళ్ళాడు. అక్కడ సింహాన్ని కొట్టాడు. అప్పుడా సింహం మానవాకృతి ధరించి తాను సాతుడనే యక్షుడననీ, కుబేరునకు మిత్రుడననీ, కృష్ణవేణిలో స్నానం చేస్తున్న ముని కన్యను చూసి మోహించి గాంధర్వ వివాహం చేసుకున్నానని, తమ దాంపత్యాన్ని చూసి సహించలేని మునులు తమని సింహదంపతులు కమ్మని శపించారని, ఈ బాలుడు తమకు జన్మించాడని ఇతడిని రాజ్యాభిషిక్తుడ్ని చెయ్యమని చెప్పి అంతర్ధానమయ్యాడు. దీపకర్ణి పరాక్రమశాలి అయిన ఆ బాలుడ్ని తెచ్చి పట్టాభిషిక్తుడ్ని చేశాడు. శాతుని వాహనంగా కలిగిన ఆ శాతవాహనుని ఈ శ్రీకాకుళాన్ని రాజధానిగా చేసుకొని చిరకాలం రాజ్యాపాలన చేశాడు.

పూర్వం నిశంభుడనే నాగరాజు బాధనుంచి ఆంధ్రవిష్ణువు అనే ఆంధ్రరాజు ఆంధ్రప్రాంతానికి విముక్తి కలిగించాడని అందువలన ప్రజలు అతడిని దైవంగా ఆరాధించేవారని ఈయనకు "ఆంధ్రనాయకస్వామి" అని, "తెలుగురాయ"డని, "తెలుగువల్లభు"డనీ పేర్లు కలవు.

ఈ స్వామి మహాత్మ్యాన్ని గురించి ఓ కథ చెబుతారు. కోదండరామన్న అనే రాజు పరిపాలించే కాలంలో ఈ దేవాలయ పూజారి శ్రీకాకుళస్వామికి వెయ్యాల్సిన పూలదండని ముందు తన ఉంపుడు గత్తెకు వేసి తరువాత స్వామికి వేసేవాడు. ఒకరోజు కోదండరామన్న స్వామి దర్శనార్థం రాగా పూజారి ఆ మాలను రాజుగారి మెడలో వేశాడు. ఆ మాలలో దీర్ఘ శిరోజం కనిపించడంతో అది ఎలా వచ్చిందని రాజు ప్రశ్నించగా స్వామి వారి విగ్రహానికి జుట్టు ఉందని ఈ శిరోజం దానిలోని దేనిని పూజారి అబద్ధం చెప్పాడు. రాజు ఆ విగ్రహాన్ని పరిశీలింప తలపెట్టాడు. ఈ ఆపద నుంచి తనను కాపాడమని పూజారి స్వామిని మనస్సులోనే ప్రార్థించాడు. రాజు విగ్రహం వెనక్కు వెళ్ళి చూడగా స్వామి మహిమ వలన ఆ విగ్రహానికి వెనుక నిజంగానే వెంట్రుకలు కనిపించాయి. అందవలనే ఈ స్వామికి కుంకుళ్ళమాన్యం కూడ ఉంది. తనను ఆరాధించిన భక్తులకు స్వామి ఆ విధంగా కరుణిస్తాడని చెబుతారు.

ఇక్కడ క్రీస్తు శకానికి పూర్వం బ్రహ్మ ప్రతిష్ఠితమైన శ్రీకాకుళేశ్వర స్వామి విగ్రహం ఉండేది. కృష్ణానదికి తీవ్రంగా వరదలు రావటంతో ఆ తాకిడికి ఆలయంలోని విగ్రహం కొట్టుకుపోయింది. ఈ క్షేత్రంలోని దేవాలయం నుండి స్వామి అదృశ్యమైన 1000 సంవత్సరాల తరువాత ఒరిస్సా పాలకుడగు అంశాభూపాలుని ప్రధానమంత్రి నరసింహవర్మ కాంచీ పురానికి బయలుదేరి మార్గ మధ్యంలో కృష్ణానదీ తీరానగల ఈ క్షేత్రానికి చేరుకున్నాడు. ఇక్కడ ఈ క్షేత్ర మహాత్మ్యాన్ని తెలుసుకొని ఎలాగైనా అదృశ్యమైన స్వామివారి విగ్రహాన్ని కనుగొని పునఃప్రతిష్ఠించాలని సంకల్పించాడు. కార్యసిద్ధికై పలుగ్రామాలు పర్యటించి పరిశోధించినా విగ్రహం ఆచూకీ తెలియక పోవటంతో నిరాశచెంది ఈ భారాన్ని ఆ దైవంపైనే ఉంచి నిరంతరం ధ్యానిస్తుండగా చివరకు ఓ రోజు భక్తవత్సలుడైన స్వామి స్వప్నంలో సాక్షాత్కరించి అహశ్చిత్రిపుర ప్రాంతాన ప్రవహిస్తున్న బ్రహ్మకుండీనదీ తీరాన వేమశర్మ అను బ్రాహ్మణుడి గృహావరణలో మరుగునపడి ఉన్నానని తన ఉనికిని తెలియజేశాడు. వెంటనే నరసింహవర్మ మేల్కొని స్వప్నంలో నిర్దేశించిన ప్రదేశానికి వెళ్లి త్రవ్వగా ఆ విగ్రహం లభించింది. అక్కడ నుండి వేద ఘోషలు,

మంగళ వాయిద్య ధ్వనుల మధ్య స్వామివారిని ఊరేగింపుతో శ్రీకాకుళ క్షేత్రానికి తీసుకువెళ్ళి శుభముహూర్తాన పునఃప్రతిష్టించాడు.

ప్రారంభంలో ఆంధ్ర విష్ణు దేవాలయ గోపుర మండపాదులను శశిబిందు అనే మహారాజు చేత నిర్మించబడినట్లు క్షేత్ర మాహాత్మ్యం ద్వార తెలియుచున్నది. ఈ ఆలయము నదీపాతముకాగ పల్లవ ప్రభువుల కాలమున తిరిగి ప్రతిష్టించబడెను. అదియును కృష్ణానది గర్భమున లీనముకాగా ఇప్పటి ఆలయ గోపురాదులను చోళరాజైన అనంత దండపాలుడు క్రీ.శ. 1081లో నిర్మించినట్లుగా ఆలయంలోని వరాహ చిహ్నంతో వున్న శిలాశాసనం ద్వారా తెలియుచున్నది.

ఈ ఆలయ ప్రాంగణంలో 16 రాతిస్తంభాలతో నిర్మించిన కల్యాణ మండపములోనే శ్రీకృష్ణదేవరాయులు అముక్తమాల్యద అనే నామాంతరము గల విష్ణు చిత్తీయ మహాప్రబంధానికి శ్రీకారం చుట్టినది ఇక్కడే. ఆంధ్రవిష్ణువు ఆదేశానుసారమే తాను ఈ గ్రంథాన్ని వ్రాసినట్లుగా దీనిలో వ్రాశాడు. క్రీ.శ. 1519 ఫిబ్రవరి 11న శ్రీకృష్ణదేవరాయులు ఈ ఆలయాన్ని దర్శించి స్వామివారి నిత్య దూపదీపనైవేద్యాలకై 5 గ్రామాలను సమర్పించినట్లుగ శాసనాల ద్వారా తెలియుచున్నది. రాజాధిరాజు, వీరప్రతాప, రాజపరమేశ్వర సాహితీ సమరాంగణ సార్వభౌమ, మూరు రాయరగండ, బానదప్పవరగండ, ఆంధ్రభోజుడు మొదలైన బిరుదులుగల శ్రీకృష్ణదేవరాయులు ఏకాగ్రతతో కూర్చొని అముక్తమాల్యదను లిఖించుచున్నట్లున్న కాంస్య విగ్రహాన్ని ఇక్కడ క్రీ.శ 11-2-2007న ప్రతిష్టించారు.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం గోల్కొండ నవాబులు, ఆ తరువాత క్రీ.శ. 1764 నుండి 1791 వరకు పరిపాలించిన దేవరకొండ ప్రభువు యార్లగడ్డ కోదండరామన్న కాలంలో ఈ ఆలయానికి జీర్ణోద్ధరణ జరిగినట్లుగా చరిత్రాధారాలవలన తెలియుచున్నది.

శ్రీనారాయణ తీర్థులవారి శ్రీకృష్ణ లీలాతరంగిణిలోను, శ్రీనాధుడి క్రీడాభిరామంలోను, చల్లపల్లి జమీందారు ఆస్థానకవి శ్రీకాసుల పురుషోత్తమ కవి ఆంధ్రనాయక శతకము రచనల్లో స్వామి వారి గురించి ప్రస్తావించబడెను.

**ఆలయవర్ణన**

ఆంధ్రదేశంలోనే ఇది మొట్టమొదటి వైష్ణవ దేవాలయం.

ఈ ఆలయం తూర్పు ముఖంగా ఉంది.

ఆలయంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారం పైన 5 అంతస్తులతో ఎత్తైన గోపురం ఉంది. గోపురం పైన 5 గోపుర కలశాలుకూడా కలవు. ప్రధాన ఆలయానికి ఎదురుగా ధ్వజస్తంభం, బలిపీఠం ఉన్నాయి. వీటిని దాటుకొని ప్రధాన ఆలయంలోకి ప్రవేశించాలి. శ్రీకాకుళేశ్వరస్వామి వారి ఆలయం రంగమంటపము, అంతరాలయం, గర్భగుడి అను మూడు భాగాలుగా ఉంది. రంగమటపములో ఉత్తరాభిముకంగా దక్షిణ గోడలోని గూడులో భాగ్యలక్ష్మీ అమ్మవారు ఉన్నారు. అమ్మవారికి ఎదురుగా ఉన్న ఉత్తరపు గోడలో ఆంజనేయస్వామి విగ్రహం ఉంది. రంగమంటపంలో 4 స్తంభాల మధ్య నాట్యం చేయటానికి వీలుగా గుండ్రని వేదిక ఉంది. ఆలయానికి తూర్పు, దక్షిణ గాలి గోపురాలున్నాయి. అంతరాలయ ద్వారాని కిరుప్రక్కల జయవిజయాల విగ్రహాలున్నాయి. ద్వారబంధానికి ఇరువైపులా పూర్ణ కుంభ శిల్పాలు ఉన్నాయి.

స్వామి స్వయం వ్యక్తం. ఇక్కడ కొలువున్న శ్రీకాకుళేశ్వరస్వామికి ఆంధ్రమహావిష్ణువు,

ఆంధ్రవల్లభుడు, ఆంధ్రానాయకుడు, తెలుగువల్లభుడు, సిరికాకొలనాధుడు, తెలుగురాయుడు అనే పేర్లు కలవు.

ప్రదాన ఆలయంలో 6 అడుగుల ఎత్తులో స్వామి వారు నిలబడి నాలుగుచేతులలో శంఖ, చక్ర, గద, అభయ హస్తములతో ఆయుధాలు ధరించిన స్వామి వారి మెడలో 108 సాలగ్రామ శిలలు హారముగా ఉండటం విశేషం. స్వామివారి ఇరువైపులా చిన్న విగ్రహాలుయైన శ్రీదేవి, భూదేవి ఉన్నారు. స్వామి వారి ఆలయానికి దక్షిణభాగాన ప్రత్యేక ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు 4 అడుగుల ఎత్తులో కూర్చొని నాలుగు చేతులు కలిగి రెండు చేతులలో కలువలు, రెండు చేతులు అభయ, వరద ముద్రలను ధరించి ఉన్నారు. ఈమెకు ఆంధ్రసామ్రాజ్య అనేపేరు కూడా ఉంది. శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని క్రీ.శ. 1205లో భృగమళ్ళ అనంత భోగయ్య చేయించినట్లు శాసనాలద్వారా తెలియుచున్నది.

స్వామివారి గర్భాలయంపైన ఉన్న గోపురం వివిధ దేవతామూర్తుల విగ్రహాలను కలిగి సందర్శకులను ఆకర్షిస్తుంది. ఈ గోపురంకు "భద్రకోటి" విమానం అని పేరు.

స్వామివారి ఆలయానికి ఉత్తరాన శ్రీచెన్నకేశవ స్వామివారి ఆలయం ఉంది. ఆలయ ప్రాంగణంలో శ్రీసీతారామ చంద్రస్వామి, లక్ష్మీ అమ్మవారు, శ్రీలక్ష్మీనరసింహస్వామి, ఆళ్వార్లు విగ్రహాలు ఉన్నాయి. ఇక్కడున్న సీతాసమేతుడైన శ్రీరామచంద్రస్వామికి మీసాలు ఉండటం విశేషం. శ్రీకృష్ణదేవరాయలు శ్రీచెన్నకేశవస్వామివారి కిరీటానికి చుట్టూ దశావతారాలతో చెక్కిన అచ్చును బహుకరించారు. ఇక్కడ స్వామికి శంఖచక్రాలు ఎడమచేతిలో ఉండాల్సింది కుడి చేతిలో, కుడిచేతిలో ఉండాల్సింది ఎడమ చేతిలో ఉంటాయి.

ఇక్కడ క్షేత్రపాలకుడు ప్రసన్న మల్లిఖార్జునుడు. ఒక్కరాత్రి నియమముతో ఈస్వామిని ఉపాసించిన యెడల కోరిన వరములు ఇచ్చేదేవుడిగా భక్తులు నమ్మువలన ఇక్కడ వెలసిన శివుడు ఏకరాత్రి ప్రసన్న మల్లిఖార్జునుడుగా ప్రసిద్ధి పొందాడు. ఇక్కడ ఆంజనేయస్వామి ఆలయంకూడా ఉంది.

ఈ క్షేత్రంలో దేవప్రహదము, బ్రహ్మప్రహదము, రుద్రప్రహదము, చక్రతీర్థము, వేదన విష్ణ సూర్యతీర్థాలు, పాపవినాశన తీర్థం ఉన్నాయి.

ఆలయంలో అత్యంత సుందరంగా చెక్కిన రాతి చెక్కకట్టడాలు చోళ, పాండ్యరాజుల శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనాలు.

శాస్త్రీయమైన దేవదాసీ నృత్య సంప్రదాయానికి పీఠం ఈ శ్రీకాకుళం. ఈ ఆలయం దేవదాశీల ఆరాధనా నృత్యాలకు రంగస్థలంగా ఉండేదట.

ఇక్కడ ఎప్పుడూ అగ్నిహోమం జ్వలిసస్తూనే ఉంటుంది. ఇదినిత్యాగ్ని హోత్రమే.

ఇక్కడవున్న కృష్ణానదిలో స్నానం చేసి స్వామిని దర్శించినట్లయితే కైలాసవాసము లభిస్తుందని భక్తుల నమ్మకం.

సర్వపాపహరణం శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణ దర్శనం అనే నానుడి ప్రచారంలో ఉంది.

ప్రధానోత్సవాలు

ఆంధ్రమహా విష్ణువు కళ్యాణోత్సవం వైశాఖ శుద్ధదశమి నుంచి బహుళ పాడ్యమి వరకు జరుగుతాయి. ఏకరాత్రి ప్రసన్న మల్లిఖార్జున స్వామి బ్రహ్మోత్సవాలు చైత్రశుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు 5 రోజులు జరుగుతాయి. వైకుంఠ ఏకాదశి, సంక్రాంతి, ఉగాది, దసరా ఉత్సవాలు కూడా వైభవంగా జరుగుతాయి. □